మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 23-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 324 Issue: 324

23 మే 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:45 సూర్యాస్తమయం - సా. 6:40 తిథి అష్టమి తె. 4:280 వరకు తరువాత నవమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం మఖ రా. 2:080 వరకు తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ) యోగం ధ్రువ ఉ. 6:09 వరకు కరణం విష్టి సా. 4:46 వరకు బవ తె. 4:280 వరకు వర్జ్యం మ. 2:09 నుండి మ. 3:45 వరకు దుర్ముహూర్తం ఉ. 7:29 నుండి ఉ. 8:20 వరకు రాహుకాలం ఉ. 8:59 నుండి ఉ. 10:36 వరకు యమగండం మ. 1:49 నుండి మ. 3:26 వరకు గుళికాకాలం తె. 5:45 నుండి ఉ. 7:22 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:09 నుండి తె. 4:57 వరకు అమృత ఘడియలు రా. 11:49 నుండి రా. 1:25 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:38 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial



## ఉడుకుతున్న జైతాల

### దేశంలోనే 11వ స్థానం.. ఉదయం ఎండ మన దగ్గరే అధికం

### ప్రపంచంలో టాప్ 50 నగరాలు మనవే

భారతదేశం ఎప్పుడూ లేనంతగా ఎండలతో మాడిపోతోంది. దేశంలో అనేక ప్రాంతాల్లో గరిష్ట స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం కూడా భారీగా ఎండలు నమోదయ్యాయి. ముఖ్యంగా, తెలంగాణలోని జగిత్యాలలోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



న్యూఢిల్లీ: ఉదయం 43 డిగ్రీల ఎండలతో జగిత్యాల దేశంలోనే 11వ స్థానంలో ఉంది. ఉదయం ప్రపంచంలోనే అత్యధిక ఎండ (ఉష్ణోగ్రత) కలిగిన టాప్ 50 నగరాలు ఇండియాలోనే ఉండగా, ఇండియాలో టాప్ ప్లేస్‌లో ఒడిశాలోని బాలంగిర్ ఉంది. ఇక్కడ ఉదయం పూట అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రెండో స్థానంలో మహారాష్ట్రలోని చంద్రాపూర్ (44 డిగ్రీలు), మూడో స్థానంలో యూపీలోని ప్రయాగ్‌రాజ్ (44 డిగ్రీలు), నాలుగు, ఐదు స్థానాల్లో చత్తీస్‌గడ్‌లోని బిలాస్‌పూర్, మహాసముంద్ (44 డిగ్రీలు), ఆరవ స్థానంలో బిహార్‌లోని బుక్సర్ (44 డిగ్రీలు), ఏడో స్థానంలో చత్తీస్‌గడ్‌లోని దుర్గ్ (44 డిగ్రీలు), ఎనిమిదో స్థానంలో బిహార్‌లోని సాసారామ్ (43 డిగ్రీలు), తొమ్మిదో స్థానంలో చత్తీస్‌గడ్‌లోని భిలాయ్ (43 డిగ్రీలు), పదో స్థానంలో యూపీలోని మీర్జాపూర్ (43 డిగ్రీలు) నిలిచాయి. ఇక ఆ తర్వాతి స్థానంలో తెలంగాణకు చెందిన జగిత్యాల ఉంది. వాయవ్య భారతం నుంచి వేడిగాలులు వీయడం వల్ల ఈ తరువాయి 2 వ పేజీలో...

## విద్యుత్తును పొదుపు చేయండి

### వేసవి వేళ భారీగా డిమాండ్.. జాగ్రత్తగా వాడుకోవాలని కేంద్రం సూచన

సూపర్ ఎల్‌నినో.. వాతావరణ మార్పులు, వాయువ్య వేడి గాలులు వెరసి ఈ వేసవిలో భారత్ భగ్గుమంటోంది. ఇల్లు దాటి బయటకొస్తేనే కాదు.. ఇళ్లలోనూ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దేశవ్యాప్తంగా ప్రచండ భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలతో బయటకు రావాలంటేనే జనం భయపడిపోతున్నారు.

న్యూఢిల్లీ: ఓవైపు అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలులు, ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీంతో దేశంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యుత్ శాఖ ప్రజలకు కీలక సూచనలు చేసింది. రోజురోజుకు తీవ్రమవుతోన్న ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని పేర్కొంది. ముఖ్యంగా పగటి సమయంలో వినియోగం రికార్డు స్థాయికి చేరుకుందని.. విద్యుత్‌ను జాగ్రత్తగా వాడుకోవాలని సూచించింది. మే 21న తరువాయి 2 వ పేజీలో...



# ఐఏఎస్‌ల పిల్లలకు.. రిజర్వేషనా?



### సామాజిక పురోగతి సాధించాక ఇంకెందుకు?

### ఇలాగైతే రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి బయటపడలేం

### ఇది తీవ్రంగా పరిగణించాల్సిన అంశం: సుప్రీం కోర్టు

వెనుకబడిన తరగతులలో ఆర్థికంగా, విద్యాపరంగా ఉన్నత స్థానాలకు చేరుకున్న కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను నిరంతరం పొడిగించడంపై సుప్రీం కోర్టు పలు ప్రశ్నలను లేవనెత్తింది. కోటా ద్వారా సామాజిక పురోగతి సాధించిన కుటుంబాలు, కాలక్రమేణా రిజర్వేషన్ వ్యవస్థ నుంచి వెలుపలికి రావాలని కోర్టు మౌఖికంగా అభిప్రాయపడింది.

న్యూఢిల్లీ: ఫలాలు అందుకుని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నతస్థితికి చేరిన కుటుంబాలు.. అదే కోటాను తరతరాలుగా కోరుకోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్‌లై.. ప్రభుత్వ సర్వీసుల్లో కొనసాగి స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా అవసరమా?' అని సుప్రీం కోర్టు పలు ప్రశ్నలు సంధించింది. ఓబీసీ క్రిమీలేయర్ (ధనికవర్గం) పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బీవీ నాగరత్న, తరువాయి 2 వ పేజీలో...



## నా అవసరం లేదిక!

### అప్పగించిన పని పూర్తి చేశా

### ఆకునూరి మురళి వెల్లడి

### విద్యా కమిషన్ చైర్మన్ పదవికి రాజీనామా

హైదరాబాద్, మే 22 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ చైర్మన్ పదవికి ఆకునూరి మురళి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను సీఎస్‌కు పంపించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ.. 'మేం విద్యపై సిఫార్సులతో కూడిన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించాం. నాకు అప్పగించిన పనిని పూర్తిచేసినందున -2 వ పేజీలో...





బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,704 |
| వెండి (కిలో): | రూ.3,00,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,075 |



### నేడు యాదగిరిగుట్టకు సీఎం రేవంత్

### వేదపాఠశాలకు భూమి పూజ

యాదగిరిగుట్ట/భువనగిరి బ్యూరో, మే 22 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి శనివారం యాదగిరిగుట్టలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వేద పాఠశాలకు భూమిపూజ, లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకోనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన షెడ్యూల్ విడుదలైంది. శనివారం ఉదయం 9 గంటలకు తరువాయి 2 వ పేజీలో...

## కేంద్రానికి ఆర్బీఐ బాసట

### రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్

దేశీయ ఆర్థిక వ్యవస్థపై చమురు మంటలు రేపుతున్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) భారీ ఊరటనిచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ కేంద్ర ప్రభుత్వానికి రూ.2.86,588.46 కోట్ల మిగులు నిధులను (డివిడెండ్) బదిలీ చేయనున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది.





న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం అందుకున్న రూ. 2.7 లక్షల కోట్ల డివిడెండ్ కంటే ఇది ఎక్కువ కావడం గమనార్హం. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన శుక్రవారం జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో ఈ నిధుల బదిలీకి బోర్డు ఆమోదం తెలిపింది. శుక్రవారం ఆర్బీఐ విడుదల చేసిన అధికారిక మీడియా ప్రకటన ప్రకారం.. కేంద్ర బ్యాంక్ స్థూల ఆదాయం గత సంవత్సరంతో పోలిస్తే 26.42% పెరిగింది. రిస్క్ నిబంధనలకు ముందు ఆర్బీఐ ఖర్చులు 27.60% పెరిగాయి. రిస్క్ ప్రొవిజన్, చట్టబద్ధమైన నిధులకు బదిలీ చేయక ముందు ఆర్బీఐ నికర ఆదాయం 2025 ఆర్థిక సంవత్సరంలో తరువాయి 2 వ పేజీలో...



## 2000 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్స్

### అరుదైన రికార్డ్ సాధించిన నిమ్స్.. మంత్రి రాజనర్సింహ అభినందనలు

నిమ్స్ హాస్పిటల్ మరో అరుదైన మైలురాయిని చేరుకుంది. దేశంలో 2 వేల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేసిన ప్రభుత్వ హాస్పిటల్‌గా రికార్డు సృష్టించింది. 1989లో నిమ్స్‌లో తొలి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయగా, తాజాగా 2000ల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేసినట్టు నిమ్స్ డైరెక్టర్, డాక్టర్ బీరప్ప శుక్రవారం ప్రకటించారు.

హైదరాబాద్, మే 22 (ఈవార్తలు): నిమ్స్ యూరాలజీ, నెఫ్రాలజీ విభాగం డాక్టర్లు, సిబ్బంది అద్భుతమైన పనితీరుతోనే ఈ అచీవ్‌మెంట్‌ను సాధించగలిగామని బీరప్ప తెలిపారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిమ్స్‌కు సంపూర్ణ సహకారం అందిస్తున్న సీఎం తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



తూనీగలు చూస్తే సాధారణ జీవుల్లాగే కనిపిస్తాయి. కానీ, దోమలను ఏరిపారేసే శక్తి వీటి సొంతం. బ్లేడ్ల లాంటి రెక్కలు, వేటగాడి కంటే పదునైన చూపును కలిగి ఉంటాయి. గాలిలోనే దోమలను వేటాడతాయి. ఒక రోజులో 30 నుంచి 100 దోమలను తింటాయి. ఇవి జీవితాంతం దోమలను నియంత్రణకే పాటుపడతాయి. పర్యావరణ సమతుల్యతలో వీటి పాత్ర అమోఘం.

## భగీరథ్‌ను దాచింది రేవంతే

### సీఎం, కేంద్ర మంత్రి కుమ్మక్కు

### పంట కొనుగోళ్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వానికి కేటీఆర్ డిమాండ్



హైదరాబాద్, మే 22 (ఈవార్తలు): బండి భగీరథ్ విషయంలో సీఎం, కేంద్రమంత్రి కుమ్మక్కయ్యారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. నిందితుడు 9 రోజులపాటు పోలీసులకు దొరక్కుండా చూసింది ఎవరని ప్రశ్నించిన కేటీఆర్, ప్రధాని పర్యటన ఉన్నందున కేసు నమోదు చేయలేదని పోలీసులు అనడం సిగ్గుచేటన్నారు. పోక్సో కేసులో నిందితుడిని కాపాడేందుకు సీఎం ప్రయత్నించారని కేటీఆర్ ఆరోపించారు. హైకోర్టులో బెయిల్ రాదని తేలిన తర్వాతే బండి భగీరథ్‌ను అదుపులోకి తీసుకున్నారన్నారు. అప్పగించామని, అరెస్టు చేశామని సీఎం, కేంద్రమంత్రి కలిసి డ్రామాలు తరువాయి 2 వ పేజీలో...



## భగీరథ్‌ను కస్టడీకి ఇవ్వండి

### కోర్టులో పోలీసుల పిటిషన్.. వాయిదా వేసిన పోక్సో కోర్టు

మల్కాజిగిరి, మే 22 (ఈవార్తలు): బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ పోలీస్ కస్టడీ పిటిషన్‌ను మల్కాజ్‌గిరి పోక్సో ప్రత్యేక కోర్టు వాయిదా వేసింది. బండి భగీరథ్ కేసులో పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై -2 వ పేజీలో...

## ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తాం

### రేవంత్ సర్కారు రియల్‌ఎస్టేట్ వ్యాపారం

### మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపణలు



కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని తేల్చి చెప్పారు. అక్కడ ఫార్మా సిటీ నిర్మించేందుకే కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు ఇచ్చిందని స్పష్టం చేశారు. ఈ విషయంలో డీవియేషన్ ఉంటే రైతుల భూములను వెనక్కి ఇవ్వాలని పార్లమెంట్ చేసిన చట్టంలో ఉందని హరీశ్ రావు వెల్లడించారు.

హైదరాబాద్, మే 22 (ఈవార్తలు): ఈ మధ్య తెలంగాణ హైకోర్టులో ఒక కేసు విషయంలో తాము ఫార్మా సిటీని కంటిన్యూ చేస్తున్నామని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెప్పిందని హరీశ్ రావు గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ కేవలం డ్రామా మాత్రమే చేస్తుందని.. అక్కడ ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని హరీశ్ రావు తెలిపారు. 75 శాతం ఫార్మా సిటీ ఉండి.. 25 శాతం మిగతావి ఉండాలని తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

23.5.2026

మేషం: ఇతరులతో వివాదాలు రాజి చేసుకుంటారు. దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధనలబ్ధి కలుగుతుంది. మిత్రుల నుండి విలువైన విషయాలు తెలుస్తాయి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

వృషభం: ప్రయాణాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. బంధువర్గంతో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. వ్యాపార, ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. ఋణ ఒత్తిడి పెరుగుతుంది.

మిధునం: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందుతారు. నూతన కార్యక్రమాలు కార్యరూపం దాలుస్తాయి. ఆర్థిక పరిస్థితి ఉత్సాహాన్నిస్తుంది. వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

కర్కాటకం: ఇంటాబయట గందరగోళ పరిస్థితులుంటాయి. ధనపరంగా ఒత్తిడి పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు ఉంటాయి. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. దూరప్రయాణాలలో వాహన ఇబ్బందులు కలుగుతాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు చికాకు పరుస్తాయి.

సింహం: నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారమున ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. ఇంటా బయట ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. అవసరానికి సన్నిహితుల సహాయం అందుతుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. సోదరుల నుండి శుభవార్తలు అందుతాయి. ఉద్యోగాలు సజావుగా సాగుతాయి.

కన్య: సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆర్థికంగా పురోగతి సాధిస్తారు. నూతన వ్యాపారమునకు పెట్టుబడులు పెట్టి లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు దక్కుతాయి. భూవివాదాలు పరిష్కారమౌతాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

తుల: ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన శిరో బాధలు తప్పవు. చేపట్టిన పనులు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. వ్యాపార విస్తరణలో ఆటంకాలు కలుగుతాయి. ఉద్యోగాలలో అధికారుల ఆగ్రహానికి గురికావలసి వస్తుంది.

వృశ్చికం: స్థిరాస్తి వివాదాలు మరింత బాధిస్తాయి. సోదరులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. మానసిక అశాంతి కలుగుతుంది. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ముఖ్యమైన పనులలో కష్టపడ్డా ఫలితం కనిపించదు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

ధనస్సు: స్థిరాస్తి కొనుగోలుకు అవరోధాలు తొలగుతాయి. ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. వ్యాపార విషయమైన పెద్దల సలహా తీసుకోవడం మంచిది. చేపట్టిన పనులు ఉత్సాహంగా పూర్తి చేస్తారు. ఆత్మీయులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతల నుండి ఉపశమనం పొందుతారు. దైవచింతన పెరుగుతుంది.

మకరం: విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. గృహ నిర్మాణ విషయంలో ముఖ్య నిర్ణయాలు అమలుచేస్తారు. రాజకీయ వర్గాల నుండి ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఆస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలు సజావుగా సాగుతాయి. నిరుద్యోగుల కలలు ఫలిస్తాయి.

కుంభం: బంధువులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఇంటా బయట ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో ఆటంకాలు ఉంటాయి. నూతన ఋణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఉద్యోగమున ఊహించని సమస్యలు కలుగుతాయి. దైవ చింతన పెరుగుతుంది.

మీనం: ఉద్యోగమున విలువైన పత్రాల విషయంలో జాగ్రత్త అవసరం. ప్రయాణాలు వాయిదా వెయ్యవలసి వస్తుంది. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఆర్థిక విషయాలు గందరగోళంగా ఉంటాయి. చేపట్టిన పనులు మధ్యలో విరమిస్తారు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. దైవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు.

# ఐఏఎస్‌ల పిల్లలకు రిజర్వేషనా?

మొదటి పేజీ తరువాయి

జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారకత ద్వారా సమాజంలో ఒక స్థాయి వస్తుందని పేర్కొన్నారు. "తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్ అధికారులు.. ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడి ఉన్నతస్థానానికి చేరుకుని, వారిలో సామాజిక పురోగతి స్పష్టంగా కనిపిస్తోంది. ఇటువంటి వారందరినీ రిజర్వేషన్ల నుంచి మినహాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. కానీ, ఆ మినహాయింపులను వారు సవాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని కూడా మనం మనసులో ఉంచుకోవాలి.. రిజర్వేషన్ల ద్వారా ప్రయోజనం పొంది ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత కూడా వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరైంది కాదు.. ఇలాగైతే రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి మనం ఎప్పటికీ బయటపడలేం.. దీనిని తీవ్రంగా పరిగణించాల్సి ఉంది" అని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. ఈ కేసులో పిటిషనర్ల తరపున హాజరైన సీనియర్ లాయర్ శశాంక్ రత్నూ.. సదరు వ్యక్తులను వారి జీతం ఆధారంగా కాకుండా, వారి హోదా ఆధారంగా మినహాయించారని తెలిపారు. దీనిపై లోతైన పరిశీలన అవసరమని, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కేటగిరీకి, క్రీమీలేయర్‌కు మధ్య స్పష్టమైన తేడా ఉండాలని కోరారు. దీనికి జస్టిస్ నాగరత్న స్పందిస్తూ.. ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో సామాజిక వెనుకబాటుతనం ఉండదని, కేవలం ఆర్థిక వెనుకబాటుతనం మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. అయితే, లాయర్ శశాంక్ ఈడబ్ల్యూఎస్ కంటే క్రీమీలేయర్ పరిమితి నిబంధనలు చాలా సరళంగా ఉండాలని, రెండింటినీ ఒకేలా చూస్తే వాటి మధ్య తేడా లేకుండా పోతుందని వాదించారు. 'సామాజికంగా, విద్యాపరంగా ఒక వ్యక్తి వెనుకబడి ఉండొచ్చు కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుంది.. ఇక్కడ ఒక సమతౌల్యత అవసరం' అని కోర్టు ఉద్ఘాటించింది. అన్ని అవకాశాలను ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని నిరుపేదలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. సమాజంలో కేవలం కొందరికే రిజర్వేషన్ల ఫలాలు పరిమితం కాకూడదని, అట్టడుగున ఉన్న వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఇదిలా ఉండగా, 1992 నాటి 'ఇంద్ర సాహ్ని' (మండల్ కమిషన్) కేసులో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ల కోటాను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం రూ. 8 లక్షల వార్షికాదాయంతో పాటు.. రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ అధికారులు, సైనికాధికారుల పిల్లలకు ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్‌గా పరిగణించి రిజర్వేషన్ల కోటా నుంచి మినహాయిస్తున్నారు. ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ పలువురు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కేసులో కేంద్రం, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసిన సుప్రీం కోర్టు తదుపరి విచారణను వాయిదా వేసింది.



# కేంద్రానికి ఆర్బీఐ బాసట

మొదటి పేజీ తరువాయి

రూ.3,13,455.77 కోట్లు ఉండగా.. 2026 ఆర్థిక సంవత్సరంలో అది రూ.3,95,972.10 కోట్లకు చేరింది. మార్చి 31, 2026 నాటికి రిజర్వ్ బ్యాంక్ బ్యాలెన్స్ షీట్ పరిమాణం 20.61% వృద్ధితో రూ.91,97,121.08 కోట్లకు చేరుకుంది. ప్రభుత్వానికి బదిలీ చేసే డివిడెండ్‌ను పెంచినప్పటికీ, భవిష్యత్తు సవాళ్లను తట్టుకునేందుకు ఆర్బీఐ తన 'కంటింజెంట్ రిస్క్ బఫర్' (ఆకస్మిక ప్రమాదాల నిధి) పరిమాణాన్ని భారీగా పెంచింది. 2026 ఆర్థిక సంవత్సరానికి గాను అత్యవసర నిధి కింద రూ.1,09,379.64 కోట్ల బదిలీకి బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మునుపటి సంవత్సరంలో ఈ కేటాయింపు కేవలం రూ.44,861.70 కోట్లుగా మాత్రమే ఉండటం విశేషం. ప్రస్తుతం దేశంలో ఇంధన ధరల పెరుగుదల వల్ల దిగుమతి బిల్లులు భారంగా మారాయి. దీనికి తోడు కరెంట్ ఖాతా లోటు పెరగడం, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు నిధులను ఉపసంహరించుకోవడం వంటి అంశాలు దేశ ఆర్థిక స్థితిపై ఒత్తిడి తెస్తున్నాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో ఆర్బీఐ నుంచి అందుతున్న ఈ భారీ డివిడెండ్.. కేంద్ర ప్రభుత్వానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక బలమైన రక్షణ కవచంలా (బఫర్‌గా) ఉపయోగపడనుంది. సాధారణంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతి సంవత్సరం తన వివిధ రకాల పెట్టుబడులు, విదేశీ మారక నిల్వల నిర్వహణ, కరెన్సీ నోట్ల ముద్రణ ద్వారా వచ్చే ఆదాయం నుండి తన ఖర్చులు, రిస్క్ నిధులను మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని డివిడెండ్ రూపంలో కేంద్ర ప్రభుత్వానికి బదిలీ చేస్తుంది. ఈ నిధులు ప్రభుత్వ బడ్జెట్ లోటును పూడ్చుకోవడానికి, సంక్షేమ కార్యక్రమాలకు ఎంతో కీలకంగా ఉంటున్నాయి.




## ఉడుకుతున్న జైతాల

మొదటి పేజీ తరువాయి

పరిస్థితి తలెత్తుతోందని వాతావరణ నిపుణులు అంటున్నారు. సాధారణ వేసవి తీవ్రతే కాకుండా, జగిత్యాల ప్రాంతం దేశంలోనే అత్యధిక హీట్ రిస్క్ జోన్‌గా పలు ప్రధాన కారణాలు ఉన్నాయని చెప్తున్నారు.

ఇవీ కారణాలు:

భౌగోళిక ఉపరితల స్థితులు: జగిత్యాల, దాని పరిసర ఉత్తర తెలంగాణ జిల్లాల భూభాగం సముద్రతీరానికి దూరంగా, అంతర్భాగంలో ఉండటం వల్ల ఇక్కడ పగటి ఉష్ణోగ్రతలు త్వరగా గరిష్ట స్థాయికి చేరుకుంటున్నాయి.

ప్రీ-మన్సూన్ వర్షాల కొరత: ఈ ఏడాది ఆశించిన స్థాయిలో ముందస్తు వేసవి జల్లులు కురవకపోవడంతో భూమిలో తేమ శాతం పూర్తిగా తగ్గిపోయింది. ఎండిపోయిన నేల సూర్యరశ్మిని వేగంగా పీల్చుకుని వాతావరణాన్ని నిప్పుల కొలిమిలా మారుస్తోంది.

వాయవ్య భారత వేడిగాలులు: వాయవ్య దిశ నుండి వీస్తున్న పొడి వడగాలులు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా ప్రయాణించి ఉత్తర తెలంగాణ జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

పచ్చదనం క్షీణత, పట్టణీకరణ: మారుతున్న కాలంతో పాటు కాంక్రీట్ కట్టడాలు పెరగడం, అడవుల విస్తీర్ణం తగ్గడం వల్ల స్థానికంగా 'అర్బన్ హీట్ ఐలాండ్' ప్రభావం ఏర్పడి వేడి గాలి వాతావరణంలోనే నిలిచిపోతోంది.

## నేడు యాదగిరిగుట్టకు సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి బయలుదేరుతారు. అనంతరం 9:15 గంటలకు ప్రతిపాదిత వేద పాఠశాల స్థలానికి చేరుకుంటారు. 9:15 నుంచి 9:45 మధ్య వేద పాఠశాలకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొంటారు. సరిగ్గా ఉదయం 9:37 గంటలకు ఎస్ఎల్ఎన్ఎస్‌డీ వేద పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 9:50కు వేద పాఠశాల స్థలం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బయలుదేరుతారు రేవంత్ రెడ్డి. 10 గంటలకు దేవాలయానికి చేరుకుంటారు. 10 నుంచి 10:30 వరకూ స్వామివారిని దర్శించుకుంటారు. 10:30కు ప్రెసిడెన్షియల్ సూట్‌కు బయలుదేరి 10:40కి అక్కడికి చేరుకుంటారు. ఉదయం 10:40 నుంచి 11 గంటల వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్రాంతి తీసుకుంటారు.

## భగీరథ్‌ను కస్టడీకి ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి

విచారణను కోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై ఈనెల 26వ తేదీన విచారణ జరుపుతామని కోర్టు తెలిపింది. ఈ కేసులో బండి భగీరథ్‌ను అదుపులోకి తీసుకుని.. విచారణ జరిపేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై పోక్సో కోర్టు మళ్లీ ఆ రోజున విచారణ చేపట్టనుంది. ప్రస్తుతం బండి భగీరథ్ చర్లపల్లి జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. ఇప్పటికే ఈ కేసులో దర్యాప్తు జరుపుతున్న కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలోని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్).. బాధితురాలితోపాటు ఆమె తల్లి వద్ద నుంచి కీలక విషయాలు సేకరించారు. అదే సమయంలో బండి భగీరథ్ 10 మంది ఫ్రెండ్స్‌ను విచారణ చేసి.. వారి వద్ద నుంచి కూడా కీలక సమాచారాన్ని రాబట్టారు. ఇప్పటికే బండి భగీరథ్ సెల్‌ఫోన్‌ను తీసుకున్న పోలీసులకు ఎలాంటి సమాచారం దొరకలేదు. సిమ్ లేకుండా ఫోన్ ఇవ్వడంతో అందులో ఎలాంటి డేటాను రికవరీ చేయలేదని తెలుస్తోంది.

# 2000 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్స్

మొదటి పేజీ తరువాయి

రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి బీరప్ప కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు 2000 మంది కిడ్నీ రోగులకు నూతన జీవితం ప్రసాదించిన నిమ్స్.. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద అండగా నిలిచింది. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో దాదాపు 95 శాతం మంది రోగులు ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా పూర్తిగా ఉచితంగా చికిత్స పొందినట్లు బీరప్ప వెల్లడించారు. శస్త్రచికిత్స మాత్రమే కాకుండా, అవయవ మార్పిడి అనంతరం జీవితాంతం అవసరమయ్యే మందులను కూడా ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిమ్స్ యూరాలజీ విభాగం హెడ్, డాక్టర్ రాహుల్ రాజ్‌ను బీరప్ప అభినందించారు. యూరాలజీ విభాగం ఆధ్వర్యంలోనే ఈ ఘనత సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. క్లిష్టమైన బహుళ రక్తనాళాల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు, చిన్నారుల్లో ట్రాన్స్‌ప్లాంట్లు, రీ-ట్రాన్స్‌ప్లాంట్లు వంటి సవాలుతో కూడిన ఆపరేషన్లను యూరాలజీ టీమ్ విజయవంతంగా నిర్వహించిందని ఆయన పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో ప్రభుత్వ హాస్పిటల్‌లో తొలి రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ కూడా నిమ్స్‌లోనే నిర్వహించడం విశేషం.

### నిమ్స్ వైద్య బృందానికి సీఎం, మంత్రి అభినందనలు

నిమ్స్ వైద్య బృందం సాధించిన ఈ అరుదైన ఘనతపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనూ అత్యాధునిక వైద్యం అందించగల సామర్థ్యం తెలంగాణకు ఉందని నిమ్స్ మళ్లీ మళ్లీ నిరూపిస్తోందని రాజనర్సింహ అన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో అవయవ మార్పిడి సేవలను మరింత విస్తరించి, పేదలకు ఉచితంగా అత్యాధునిక, ఖరీదైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. ఇటీవల గాంధీ హాస్పిటల్‌లో 6 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో పాటు అత్యాధునిక వసతులతో కూడిన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. అలాగే, సనత్‌నగర్‌లోని టిమ్స్ హాస్పిటల్‌లో కూడా ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఎక్సలెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్లను సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి వెల్లడించారు. దీంతో ప్రభుత్వ రంగంలోనే అత్యాధునిక అవయవ మార్పిడి సేవలు మరింత విస్తృతంగా అందుబాటులోకి వస్తాయన్నారు.

## నా అవసరం లేదిక!

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నా' అని తెలిపారు. తెలంగాణ విద్యా రంగంలో కీలక పాత్ర పోషించిన ఆకునూరి మురళి 2024లో టీఈసీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన పదవీకాలం రెండు సంవత్సరాలు కాగా, శుక్రవారం సమగ్ర నివేదిక సమర్పించి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఆకునూరి మురళి రాష్ట్రంలోని ప్రాథమిక నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టారు. ఆయన కరికులం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, బోధన పద్ధతులు మెరుగుపరచడంపై దృష్టి పెట్టారు. దీర్ఘకాలిక విద్యావిధాన రూపకల్పన చేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. రాజకీయ ప్రభావం లేకుండా స్వతంత్ర నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేసి పాఠశాలల పనితీరును పర్యవేక్షించారు. ఆయన చైర్మన్‌గా ఉన్న సమయంలో 100 మోడల్ స్కూల్స్ ఏర్పాటు ప్రణాళిక రూపొందించారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పేద కుటుంబాల పిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్య అందించే ప్రయత్నం చేశారు.

## విద్యుత్తును పొదుపు చేయండి

మొదటి పేజీ తరువాయి

గురువారం దేశవ్యాప్తంగా పగలు గరిష్ట విద్యుత్ డిమాండ్ 270.82 గిగావాట్ల గరిష్ఠస్థాయికి చేరుకుందని తెలిపింది. తీవ్రమైన ఎండ, ఉక్కపోత కారణంగా వరుసగా నాలుగు రోజుల పాటు విద్యుత్ వినియోగం మునుపటి రికార్డులను అధిగమించిందని పేర్కొంది. మే 18న గరిష్ఠ డిమాండ్ 257.37 గిగావాట్లుగా కాగా.. మే 19న 260.45 గిగావాట్లకు చేరుకోగా.. మే 20న 265.44 గిగావాట్లు, మే 21న 270.82 గిగావాట్లకు పెరుగుతూ సరికొత్త రికార్డుల నమోదుచేసినట్టు పేర్కొంది. రోజూ మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య అధిక ఉష్ణోగ్రతలతో డిమాండ్ ఎక్కువగా ఉందని, ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం విపరీతంగా పెరిగిపోతోందని కేంద్ర విద్యుత్ శాఖ తెలిపింది. దీనివల్ల సరఫరా వ్యవస్థలు, గ్రిడ్ నిర్వహణపై ఒత్తిడి పెరిగి, విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంటోందని పేర్కొంది. విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్నప్పటికీ.. పరిస్థితి నియంత్రణలోనే ఉందని వెల్లడించింది. దేశవ్యాప్తంగా విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొంది. శుక్రవారం గరిష్ఠ డిమాండ్‌లో థర్మల్ విద్యుత్ 62.8%, సౌరశక్తి 22.0%, పవన శక్తి 5.0%, జల శక్తి 5.8%, మిగిలింది ఇతర వనరుల నుంచి వచ్చినట్టు తెలిపింది. థర్మల్ విద్యుత్ ప్లాంట్ల వద్ద బొగ్గు లభ్యత, సరఫరా సమర్థవంతంగా ఉందని తెలిపింది.

## భగీరథ్‌ను దాచింది రేవంతే

మొదటి పేజీ తరువాయి

ఆదారని కేటీఆర్ ఆక్షేపించారు. పోక్సో కేసు నిందితుడిని 9 రోజులు దాచిపెట్టిందెవరో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము పోరాడకుంటే బాలిక కుటుంబానికి న్యాయం జరిగేది కాదని, తమ పోరాటం, న్యాయవ్యవస్థ వల్లే బాధితులకు న్యాయం జరిగిందని కేటీఆర్ చెప్పారు. అటు.. భూములు, భూదోపిడీ మీద పెట్టిన శ్రద్ధ రైతుల మీద పెట్టాలి అని కేటీఆర్ హితవు పలికారు. ఈ ప్రభుత్వం వచ్చాక కోటిన్నర టన్నుల పంట వస్తే సగం కూడా కొనలేదని మండిపడ్డారు. పంటల కొనుగోళ్లపై ఈ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులను ఇలాగే నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ పోరాటాలకు దిగుతుందని ఆయన హెచ్చరించారు. రైతు సమస్యలే ఏకైక అజెండాగా రేపు మంత్రివర్గ సమావేశం జరగాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనటం లేదని రైతులు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారన్న కేటీఆర్, అన్నదాతలే కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ధర్నా చేస్తున్నారన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో కూడా రైతులు గురువారం ధర్నా చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. మంచిర్యాల జిల్లాలో నలుగురు రైతులు చనిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎండలో రైతులు పడిగాపులు కాస్తున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భేషజాలకు పోకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.౦

## ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తాం

మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. కానీ 75 శాతం వ్యాపారాలు.. కేవలం 25 శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారని.. ఇది చట్ట ప్రకారం చెల్లదని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని వెల్లడించారు. తాము ప్రభుత్వంలోకి వచ్చాక ఫ్యూచర్ సిటీని 100 శాతం రద్దు చేస్తామని తేల్చి చెప్పారు. తిరిగి ఫార్మా సిటీని రీస్టోర్ చేస్తామని.. ఇది తన మాట కాదని.. పార్లమెంట్ చట్టమని హరీశ్ రావు తెలిపారు. ఫార్మా సిటీ వస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించినట్లు వెల్లడించారు.

# 19 ప్లాట్లు.. 2 ఎకరాల్లో ఫాం హౌస్

**రూ.కోట్లు విలువ చేసే ఇండ్లు.. డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ అక్రమార్జన.. 11 ప్రాంతాల్లో ఏకకాలంలో ఏసీబీ సోదాలు**

హైదరాబాద్, మే 22 (ఈవార్తలు): మేడ్చల్ మల్కాజ్‌గిరి డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్‌ను ఏసీబీ అరెస్టు చేసింది. ఈరోజు ఉదయం నుంచి ఆయన కార్యాలయం సహా మరో 11 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో సోదాలు జరిగాయి. ఈ సోదాల్లో వంశీమోహన్‌కు సంబంధించిన భారీగా ఆస్తులను గుర్తించారు. వనస్థలిపురం, మణికొండ, మజీద్‌కొండ ప్రాంతాల్లో రూ.4.46 కోట్ల విలువైన 19 ఓపెన్ ప్లాట్లు, రూ.1.2 కోట్ల విలువైన 3 ఇళ్లను గుర్తించారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని నారపల్లి వద్ద 2 ఎకరాల్లో ఫామ్ హౌస్ ఉన్నట్లు గుర్తించారు. శేరిలింగంపల్లి, ఇతర ప్రాంతాల్లో వంశీమోహన్ ఆర్డీవోగా పనిచేశారు. ఆర్డీవోగా పని చేసిన సమయంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను సొంతం చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అబ్దుల్లాపూర్‌మెట్, పిగ్లీపురంలో ఎనిమిది ఎకరాలు ఆక్రమించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. భూములను తొలుత తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి ఆ తర్వాత రియల్టర్లకు ధారాదత్తం చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో ఒక రియల్టర్ నుంచి పది ప్లాట్లను గిఫ్ట్ డీడ్ చేయించుకున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఏసీబీ అధికారులు ఆయనను అరెస్టు చేశారు.



## బొంతు రామ్మోహన్ భార్యపై కేసు

పంజాగుట్ట–హైదరాబాద్, మే 22 (ఈవార్తలు): హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఒక మహిళా హాస్టల్‌లోకి చొరబడి కొందరు దుండగులు దౌర్జన్యకాండకు, రౌడీయిజానికి పాల్పడిన ఘటన సంచలనం రేపుతోంది. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ భార్య బొంతు శ్రీదేవి, ఆమె అనుచరులు బుధవారం రాత్రి ఒక గర్ల్స్ హాస్టల్‌పై దాడి చేసి హల్‌చల్ చేసిన ఉదంతంపై ఎట్టకేలకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితులు మరియు పోలీసుల కథనం ప్రకారం... అమీర్‌పేట జీహెచ్‌ఎంసీ మార్కెట్ రోడ్‌లో 'ఏషియన్ పీజీ ఫర్ గర్ల్స్ హాస్టల్'ను వీరహనుమాన్ రెడ్డి అనే వ్యక్తి గత మూడేళ్లుగా నిర్వహిస్తున్నాడు. అయితే, ఈ హాస్టల్ నడుస్తున్న భవన యజమాని బోయమ్మ కుటుంబానికి, నిర్వాహకుడు వీరహనుమాన్ రెడ్డికి మధ్య కొంతకాలంగా లీగల్ వివాదం నడుస్తోంది. ఈ క్రమంలోనే హాస్టల్‌ను ఎలాగైనా ఖాళీ చేసి, స్వాధీనం చేయాలని భవన యజమాని కూతురైన బొంతు శ్రీదేవి, ఆమె కుటుంబ సభ్యులు నిర్వాహకుడు వీర హనుమాన్ పై ఒత్తిడి తెస్తున్నారు. బుధవారం రాత్రి బొంతు శ్రీదేవి, ఆమె తల్లి బోయమ్మ దాదాపు 30 మంది అనుచరులతో కలిసి ఒక్కసారిగా మహిళా హాస్టల్‌పై దాడికి తెగబడ్డారు. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న వార్డెన్ రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్ శిరీష, వంట మనిషి భార్య అపర్ణలపై విచక్షణారహితంగా దాడి చేశారు. మహిళలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని లాగుతూ, చేతులతో కొడుతూ, కిందపడేసి కాళ్లతో తన్నారు. తీవ్రంగా గాయపడిన బాధితులను స్థానికులు గమనించి 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిని ఫోన్లలో చిత్రీకరించేందుకు ప్రయత్నించగా, వారి మొబైల్స్ లాక్కుని, ఒకరి బంగారు గొలుసును కూడా అపహరించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ భవన వివాదంపై ఇప్పటికే కోర్టులో సివిల్ కేసు నడుస్తోందని, కోర్టు 'స్టేటస్ కో' (యథాతథ స్థితి) ఆదేశాలు ఇచ్చినప్పటికీ, వాటిని ఏమాత్రం కేర్ చేయకుండా బొంతు శ్రీదేవి అనుచరులు ఈ దాడులకు పాల్పడ్డారని నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. గత మూడు రోజులుగా డయల్ 100కు ఫిర్యాదు చేసినా వేధింపులు ఆగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ దాడి వీడియోలపై బొంతు శ్రీదేవి స్పందించారు. ఈ వీడియోలు ఇప్పటివి కావని, గత ఏడాదికి సంబంధించిన వీడియోలంటూ ఆమె ఒక మీడియా సంస్థకు వివరణ ఇచ్చారు. ప్రస్తుతం హాస్టల్ నిర్వాహకుడు వీరహనుమాన్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. హాస్టల్‌లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, దాడికి పాల్పడిన బొంతు శ్రీదేవి, ఆమె తల్లి బోయమ్మతో పాటు మరో 30 మంది అనుచరులపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఒక మహిళా హాస్టల్‌లోకి ఇంతమంది చొరబడి దౌర్జన్యం చేయడం నగరంలో తీవ్ర కలకలం రేపుతోంది.

## వడ్డీలేని రుణాలు 10 లక్షలు

**మహిళా సంఘాలకు భట్టి శుభవార్త**

హైదరాబాద్, మే 22 (ఈవార్తలు): మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. ప్రజాభవన్‌లో 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లుభట్టి విక్రమార్క మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవనం వంటి అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అన్నారు. ఈ క్రమంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళలు, దళిత, గిరిజన, యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని అన్నారు.

## పదో తరగతికి అమ్మాయికి గర్భం

**రంగారెడ్డి జిల్లా మేడిగడ్డలో ఘటన**

రంగారెడ్డి, మే 22 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలంలో పదో తరగతి చదివిన ఒక మైనర్ గిరిజన విద్యార్థిని గర్భం దాల్చిన ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టారు. బాధితురాలు ఆమనగల్లు మండలంలోని మేడిగడ్డ గ్రామానికి చెందిన గిరిజన బాలిక. ఆమె ఆమనగల్లులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవలే పదో తరగతి పూర్తి చేసింది. పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలైన అనంతరం, సదరు బాలిక ప్రస్తుతం తొమ్మిది నెలల గర్భవతి అనే విషయం వెలుగులోకి వచ్చింది. అదే గ్రామానికి చెందిన ఒక యువకుడి కారణంగా ఆమె గర్భం దాల్చింది. ఈ విషయం బయటకు రావడంతో గ్రామంలోని కుల పెద్దలు మొదట పంచాయితీ సైతం నిర్వహించినట్లు సమాచారం. అయితే, మైనర్ బాలిక గర్భం దాల్చిన ఉదంతంపై సమాచారం అందగానే పోలీసులు దిగారు. బాలిక మైనర్ కావడంతో నిందితుడిపై కఠినమైన పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, అతడిని అరెస్టు చేశారు. బాధితురాలైన బాలికకు రక్షణ, వైద్య సంరక్షణ కల్పించేందుకు గాను అధికారులు ఆమెను హైదరాబాద్‌లోని ప్రభుత్వ కేర్ టేకర్ హోమ్‌కు (ప్రభుత్వ రక్షణ కేంద్రానికి) తరలించారు. ఈ కేసుపై పూర్తిస్థాయి దర్యాప్తు జరుపుతున్నారు.

## తల్లిదండ్రులను వేధిస్తున్న కొడుక్కి జైలు

హైదరాబాద్, మే 22 (ఈవార్తలు): వృద్ధులైన తల్లిదండ్రులను వేధిస్తున్న కుమారుడికి నాంపల్లి కోర్టు 60 రోజుల జైలు శిక్ష విధించింది. నారాయణగూడ పీఎస్ పరిధిలో నమోదైన కేసు వివరాల ప్రకారం.. వృద్ధులైన తల్లిదండ్రులను జి.శ్రీనివాస్ అనే వ్యక్తి శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిని అరెస్ట్ చేశారు. కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయస్థానం రెండు నెలల జైలు శిక్ష విధించింది.

# దాహం.. దాహం!

**హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్.. నిల్వ కోసం ముందస్తు బుకింగ్**



హైదరాబాద్, మే 22 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో ప్రజలు అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అధిక ఉష్ణోగ్రతకు తోడు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. భానుడి భగభగ కారణంగా నగరంలో తాగునీటి వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. దీంతో జలమండలి నీళ్ల ట్యాంకులకు కూడా డిమాండ్ భారీగా పెరిగింది. చాలా ప్రాంతాల్లో వాటర్ ట్యాంకులను ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు. నగరంలో మే నెల మొదటి 20 రోజుల్లో సుమారు 2.60 లక్షల ట్యాంకర్ల నీటిని సరఫరా చేసినట్లు జలమండలి తెలిపింది. ప్రస్తుతం వారం రోజులుగా రోజుకు సగటున 12 వేలకు పైగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. సాధారణంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో ఎక్కువ ట్యాంకర్లకు డిమాండ్ ఉండేది. మే నెలలో కాస్త తగ్గేది. కానీ ఈసారి ఇందుకు భిన్నంగా మే నెలలో ఎక్కువ ట్యాంకుల కోసం బుక్ చేసుకున్నారు. గత సంవత్సరం మే నెలలో మొదటి 20 రోజుల్లో 1.69 లక్షల నీటి ట్యాంకర్లకు డిమాండ్ ఉండగా, ఈసారి 2.60 లక్షల ట్యాంకర్లతో నీటి సరఫరా జరిగింది. వర్షాలు పడి, వాతావరణం కాస్త చల్లబడేవరకు నీటి ట్యాంకర్ల బుకింగ్ ఇదేవిధంగా ఉండవచ్చని భావిస్తున్నారు. గత మూడేళ్లను పరిశీలిస్తే 2024 మే 20వ తేదీ నాటికి 1,18,191 ట్యాంకర్లు, 2025 అదే కాలంలో 1,69,347 ట్యాంకర్లు నీటిని సరఫరా జరింది. పెట్రోల్, డీజిల్ కొరత ఆందోళనలు తలెత్తినప్పుడు వాహనదారులు బంకుల వద్ద క్యూకట్టి ముందస్తుగా భద్రపరుచుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల గ్యాస్ సిలిండర్ కొరత భయాలతోనూ ప్రజలు గ్యాస్ కోసం వేగంగా బుకింగ్ చేసి, ఇంట్లో భద్రపరుచుకున్నారు. అదనపు గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేయడంతో అవసరమైన వారికి దొరకకుండా పోయింది. ఇప్పుడు ఇదే కోవలో హైదరాబాద్‌లో నీటిని కూడా ముందస్తుగా బుకింగ్ చేసి భద్రపరుచుకుంటున్నారు. కొంతమంది అవసరం లేకపోయినా ట్యాంకర్లను బుక్ చేసుకుని నీటిని నిల్వ చేసుకుంటున్నారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది నీటి కొరత, ట్యాంకర్ల బుకింగ్‌లో అత్యధికస్థాయికి చేరుకున్నాయి.

## 3 ట్రిలియన్లే లక్ష్యం: భట్టి

హైదరాబాద్, మే 22 (ఈవార్తలు): 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతంగా ఉండి దేశ సగటు కంటే వేగంగా ముందుకెళ్తోందన్నారు. రాష్ట్రంలో పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో సేవల రంగానికి భారీ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వ్యవసాయం, సూక్ష్మ పరిశ్రమలు, మహిళా మరియు యువ పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు మరింత రుణ సహాయం అందించాలని సూచించారు. విద్యార్థుల రుణాలను భవిష్యత్ పెట్టుబడిగా చూడాలని పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు వెల్లడించారు. మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టులను ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకెళ్తోందని చెప్పారు.

## హైదరాబాద్‌కు టెస్లా!

హైదరాబాద్, మే 22 (ఈవార్తలు): హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహనాల దిగ్గజ సంస్థ టెస్లా త్వరలో సేల్స్, సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. టెస్లా ఇండియా ప్రతినిధులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో సమావేశమై హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాలు, ఇంటెలిజెంట్ మొబిలిటీ వ్యవస్థలకు అవసరమైన ఎకోసిస్టంను ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. సెమీకండక్టర్ డిజైన్, ఆటోమొబైల్ సాఫ్ట్‌వేర్, ఏఐ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో హైదరాబాద్ కీలక కేంద్రంగా ఎదిగిందని తెలిపారు. దేశంలో ఇప్పటికే నాలుగు షోరూంలు కలిగిన టెస్లా తదుపరి కేంద్రంగా హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడం సంతోషకరమన్నారు.

## 16 మంది స్పెషల్ గ్రేడ్ డీసీల బదిలీ

హైదరాబాద్, మే 22 (ఈవార్తలు): రాష్ట్రంలో వివిధ జిల్లాలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తున్న మొత్తం 16 మంది అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. వరంగల్‌లో అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న గట్టు సంధ్యారాణిని నిర్మల్ జిల్లాకు, నిర్మల్‌లో ఉన్న ఎల్ కిషోర్ కుమార్‌ను వరంగల్‌కు అదే హోదాలో బదిలీ చేసింది. సిద్దిపేటలో పనిచేస్తున్న డి.నాగరాజమ్మను అదే జిల్లాలో డీఆర్‌వోగా నియమించింది. రాష్ట్రంలో చీఫ్ ఎలక్టొరోల్ అధికారిగా ఉన్న ఆర్ దశరథ్‌ను నల్గొండ డీఆర్‌వోగా , మల్కాజిగిరిలో పనిచేస్తున్న మాలతి సముద్రాలను అక్కడే డీఆర్‌వోగా, డిప్యుటేషన్‌పై మైనారిటీ వెల్ఫేర్‌లో పనిచేస్తున్న నాగలక్ష్మిని మహబూబాబాద్ డీఆర్‌వోగా బదిలీ చేసింది. హనుమకొండలో ఆర్డీవోగా పనిచేస్తున్న రాథోడ్ రమేష్‌ను నిర్మల్ జిల్లా డీఆర్‌వోగా, జీఏడీలో ఉన్న డి ప్రేంరాజ్‌ను సూర్యాపేట డీఆర్‌వోగా బదిలీ చేసింది.

## కొనుగోళ్లపై ధర్నా.. కవిత అరెస్టు




హైదరాబాద్, మే 22 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర సచివాలయం ముట్టడికి యత్నించిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో పాటు ఆ పార్టీ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని, ధాన్యంలో తరుగు పేరిట క్వింటాకు కిలోల కొద్దీ కోత విధిస్తూ రైతులను నిలువునా ముంచేసే విధానాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ కవిత ఆధ్వర్యంలో శుక్రవారం సెక్రటేరియట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. సచివాలయం ముందు పెద్ద ఎత్తున చేరిన టీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రైతులకు మద్దతుగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ధర్నా చేస్తున్న కవితతో పాటు ఇతర ముఖ్య నాయకులను, మహిళా కార్యకర్తలను పోలీసులు దుపులోకి తీసుకున్నారు. వారిని పోలీస్ వాహనాల్లో అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో తెలంగాణ రోల్ మోడల్

హైదరాబాద్, మే 22 (ఈవార్తలు): డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో తెలంగాణను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. పౌర సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేసేలా సమగ్ర రోడ్‌మ్యాప్ రూపొందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగిన డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్–2026లో ఆయన మాట్లాడుతూ, తెలంగాణను నెక్స్ట్ జనరేషన్ ఇన్నోవేషన్స్, టాలెంట్, ఆర్థిక వృద్ధికి కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఏఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో అవకాశాలతో పాటు సైబర్ మోసాల సవాళ్లు పెరుగుతున్నాయని, సీఏలు 'సైబర్ అష్యూరెన్స్'పై కూడా దృష్టి పెట్టాలని సూచించారు.

## రెండేళ్లలో 150 కేసుల్లో శిక్షలు

**రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు రికార్డు**

రంగారెడ్డి, మే 22 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు సరికొత్త రికార్డును సృష్టించింది. చిన్నారులపై జరిగిన 150 లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులకు శిక్షలు విధించింది. కేవలం రెండేళ్ల వ్యవధిలోనే వారికి శిక్షలు విధించడం గమనార్హం. పోక్సో చట్టం–2012 కింద నమోదవుతున్న కేసులను త్వరితగతిన విచారించేందుకు ప్రత్యేక పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశారు. గత రెండేళ్లుగా ఈ ఫాస్ట్ ట్రాక్ కోర్టులో కేసుల విచారణలో వేగం పెరిగింది. పోక్సో కేసుల్లో బాధితులకు త్వరితగతిన న్యాయం జరగడంతో శిక్షలు, జరిమానాలు కూడా విధిస్తున్నారు. బాధితుల పునరావాసం కోసం అన్ని కేసుల్లో కలిపి దాదాపు రూ.3 కోట్లకు పైగా నష్టపరిహారాన్ని మంజూరు చేశారు. ఈ పరిహారం కూడా బాధితులకు త్వరగా అందేలా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తోంది. రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు గత రెండేళ్ల కేసులను పరిశీలిస్తే, 10 కేసుల్లో నిందితులకు తుదిశ్వాస విడిచే వరకు శిక్షపడగా, 15 కేసుల్లో యావజ్జీవ శిక్షలు ఖరారయ్యాయి. మరో 35 కేసుల్లో ఇరవై ఏళ్ల కారాగార శిక్ష, 17 కేసుల్లో 14 ఏళ్ళ కారాగార శిక్ష విధించింది. ఏడేళ్లు, ఐదేళ్ళు, మూడేళ్ళు, రెండేళ్ళు, ఏడాది జైలు శిక్షలు పడిన కేసులు కూడా ఉన్నాయి.

ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))


| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE: Price for 5 Lines - Rs.450 (for each extra line - Rs.90)

COLOUR: Price for 5 Lines - Rs.500 (for each extra line - Rs.100)

Phone: +91 94404 55811 | Email: contact@evarthalu.com



# ఆనకట్టల భద్రతకు

దేశవ్యాప్తంగా డ్యామ్‌ల పునరుద్ధరణకు ప్రాధాన్యత

పటిష్టమైన విధానాలు.. నాలుగంచెల యంత్రాంగం



# కేంద్రం భరోసా

## డ్రిప్ కార్యక్రమం కింద ఆనకట్టల పునరుద్ధరణ.. డ్యామ్‌ల రక్షణకు కొత్త కోర్సులు.. సంస్థలు

**ప్రపంచంలో ఎక్కువగా ఆనకట్టలు ఉన్న దేశాల్లో భారత్ మూడోస్థానంలో ఉంది. దేశంలో ఉన్న 6,628 ఆనకట్టలు వ్యవసాయ రంగానికి ఆయువుపట్టుగా నిలుస్తున్నాయి. కరువు పీడిత ప్రాంతాల్లో సిరుల సాగుకు దోహదపడుతున్నాయి. ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. అయితే, ఆనకట్టలు నిర్మించి ఏళ్లు గడుస్తుండటం ఒక సవాల్‌గా పరిణమించింది. పూడిక వల్ల ఆనకట్టల నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుండటంతో పాటు భద్రత కూడా ప్రధాన సమస్యలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆనకట్టల పునరుద్ధరణపై కేంద్రం దృష్టి సారించింది. ఆనకట్టల బలోపేతానికి విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోంది. సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటోంది.**



### ఆనకట్టల భద్రతకు విధానపరమైన చర్యలు

దేశంలోని ఆనకట్టల భద్రత, పర్యవేక్షణకు విధానపరంగానూ కేంద్రం పటిష్టమైన చర్యలను తీసుకుంటోంది. 2021లో డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని తీసుకువచ్చింది. ఇందుకోసం పటిష్టమైన నాలుగంచెల యంత్రాంగాన్ని సైతం ఏర్పాటుచేసింది. ఇందుకోసం నేషనల్ కమిటీ ఆన్ డ్యామ్ సేఫ్టీ(ఎన్‌సీడీఎస్), నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ), స్టేట్ కమిటీస్ ఆన్ డ్యామ్ సేఫ్టీ(ఎస్‌సీడీఎస్), స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్స్(ఎస్‌డీఎస్‌ఓ) పనిచేస్తున్నాయి. ఆనకట్టల భద్రత, పునరుద్ధరణ పర్యవేక్షణకు డ్యామ్ హెల్త్ అండ్ రిహాబిలిటేషన్ మానిటరింగ్ అప్లికేషన్(ధర్మ) అనే డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను సైతం ప్రాంభించింది. ఆనకట్టల భద్రతలో సామర్థ్యాల పెంపుపైనా కేంద్రం దృష్టి సారించింది. జైపూర్ ఎంఎన్ఐటీలో నేషనల్ సెంటర్ ఫర్ ఎర్త్‌క్వేక్ సేఫ్టీ ఆఫ్ డ్యామ్స్, ఐఐటీ రూర్కీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేసింది. డ్యామ్ సేఫ్టీపై ఐఐటీ రూర్కీ, ఐఐఎస్సీ బెంగళూరులో ఎంటెక్ కోర్సును ప్రవేశపెట్టింది.

### పాతబడుతున్న ఆనకట్టలు

దేశంలోని మొత్తం డ్యామ్‌లలో 26%(1,681) డ్యాములు నిర్మించి 50 ఏళ్లు దాటింది. వీటిల్లో 291 డ్యామ్‌లు నిర్మించి వందేళ్లకు పైనే అయ్యింది. 42% డ్యామ్‌లు నిర్మించి 25-50 ఏళ్లు అవుతోంది. ఆనకట్టలు నిర్మించి ఏళ్లు గడుస్తుండటంతో ప్రతియేటా ఒక్కో రిజర్వాయర్‌లో 0.74% నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోందని అంచనా. మరోవైపు పాత రిజర్వాయర్ల దృఢత్వం కూడా రోజురోజుకూ తగ్గుతోంది. ఇది ప్రజాభద్రతకు కూడా సవాల్‌గా మారే ప్రమాదం ఉంది.

### డ్రిప్ పథకంతో డ్యామ్‌ల పునరుద్ధరణ

ఆనకట్టల భద్రతకు కేంద్రం పెద్దపీట వేస్తోంది. ఇందుకోసం 2012 ఏప్రిల్‌లో డ్యామ్ రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్(డ్రిప్) కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఏడు రాష్ట్రాల్లోని 223 డ్యామ్‌లను పునరుద్ధరించింది. 2021లో డ్రిప్ రెండు, మూడో విడతను కూడా కేంద్రం రూ.10,211 కోట్ల వ్యయంతో చేపట్టింది. ఈ రెండు దశల్లో 19 రాష్ట్రాల్లోని 736 డ్యామ్‌లను పునరుద్ధరిస్తోంది. ఇందులో తెలంగాణలోని ఎన్‌టీఆర్ సాగర్, నాగార్జునసాగర్ కూడా ఉన్నాయి.

## వెనిజువెలా నుంచి భారత్‌కు ఆయిల్

**రోజుకు 4.17 లక్షల బ్యారెళ్ల సరఫరా.. మూడో పెద్ద ఆయిల్ సరఫరాదారు**

న్యూఢిల్లీ: భారతదేశానికి అత్యధికంగా ముడి చమురు సరఫరా చేస్తున్న దేశాల జాబితాలో తాజాగా వెనిజువెలా చేరింది. ఎప్పుడూ ముందుండే సౌదీ అరేబియా, అమెరికా వంటి పెద్ద దేశాలను వెనక్కి నెట్టి మే నెలలో భారత్‌కు అత్యధికంగా ఆయిల్ సరఫరా చేసిన మూడో పెద్ద దేశంగా అవతరించింది. ఆ దేశం నుంచి రోజుకు 4.17 లక్షల బ్యారెళ్ల ఆయిల్ భారత్‌కు సరఫరా అవుతోంది. రష్యా, యూఏఈ మాత్రమే వెనిజువెలా కంటే ముందున్నాయి. వెనిజువెలా నుంచి భారత్ ఆయిల్ కొనడానికి ప్రధాన కారణం తక్కువ ధర. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం వల్ల ముడి చమురు ధరలు పెరిగిపోయాయి. ఇలాంటి సమయంలో వెనిజువెలా మిగతా దేశాల కంటే తక్కువ ధరకే ఆయిల్ ఆఫర్ చేస్తోంది. అక్కడి నుంచి వచ్చే ఆయిల్‌లో సల్ఫర్ ఎక్కువగా ఉంటుంది. దీన్ని గుజరాత్‌లోని రిలయన్స్ జామ్‌నగర్ వంటి అత్యాధునిక రిఫైనరీలు శుద్ధి చేయగలవు. అందుకే రిలయన్స్ సంస్థ దీన్ని భారీగా కొనుగోలు చేస్తోంది. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం వల్ల హర్మూజ్ జలసంధి ద్వారా ఆయిల్ సరఫరా దెబ్బతింది. ఫిబ్రవరిలో ఇరాక్ నుంచి భారత్‌కు రోజుకు 9.69 లక్షల బ్యారెళ్ల ఆయిల్ వచ్చేది. మే నెలలో అది కేవలం 51 వేల బ్యారెళ్లకు పడిపోయింది. అటు అమెరికా నౌకాదళం ఇరాన్ పోర్టులను దిగ్బంధించడంతో ఇరాన్ నుంచి రావాల్సిన చమురు సరఫరా కూడా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో భారత్ ప్రత్యామ్నాయాల వైపు చూడాల్సి వచ్చింది.

## అంత దమ్ముంటే.. రండి చూద్దాం!

**భోజ్‌శాలలో ఎస్పీ వార్నింగ్ వైరల్**

భోజ్‌శాల: మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాల వివాదాస్పద కట్టడం కేవలం హిందూ దేవాలయమేనని మే 15న రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. అంతకుముందు వరకు అక్కడ ప్రతి శుక్రవారం ముస్లింలు నమాజ్ చేసుకునేందుకు అనుమతి ఉండేది. అయితే కోర్టు తీర్పు తర్వాత వస్తున్న మొదటి శుక్రవారం కావడంతో అక్కడ ఉద్రిక్తతలు తలెత్తకుండా పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ధార్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సచిన్ శర్మకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆయన జీపుపై నిలబడి అల్లరి మూకలను గట్టిగా హెచ్చరించారు. "ఎవరికైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలనే ధైర్యం ఉంటే, ప్రయత్నించి చూడండి. మేము పూర్తిగా సిద్ధంగా ఉన్నాం. ఎవరినీ వదిలిపెట్టం" అంటూ ఎస్పీ సవాల్ విసిరారు. సోషల్ మీడియాలో ఎలాంటి తప్పుడు ప్రచారాలు చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## కాక్రోచ్ పార్టీపై వేటు అనాలోచితం: శశిథరూర్

తిరువనంతపురం: ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టిస్తున్న వ్యంగ్యాస్త్ర వేదిక 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) 'ఎక్స్' ఖాతాను నిలిపివేయడంపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ స్పందించారు. ఈ చర్యను 'అనాలోచితమైన, విపత్కరమైన నిర్ణయం'గా అభివర్ణించారు. యువత తమ భావాలను, అసంతృప్తిని వ్యక్తీకరించడానికి ఒక వేదిక ఉండాలని, దాని గొంతు నొక్కడం సరికాదని ఆయన హితవు పలికారు. కేవలం ఐదు రోజుల్లోనే ఇన్‌స్టాగ్రామ్‌లో 19 మిలియన్లకు పైగా ఫాలోవర్లను సంపాదించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' ఎదుగుదల తనను ఎంతగానో ఆకర్షించిందని థరూర్ తన 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు. చట్టపరమైన డిమాండ్ మేరకు సుమారు 2 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న ఈ పార్టీ 'ఎక్స్' ఖాతాను భారత్‌లో నిలిపివేశారు. ఈ నేపథ్యంలో థరూర్ స్పందిస్తూ.. "ప్రజాస్వామ్యంలో అసమ్మతి, హాస్యం, వ్యంగ్యం, చివరకు నిరాశను వ్యక్తీకరించడానికి కూడా వేదికలు అవసరమని" అభిప్రాయపడ్డారు. సీజేపీ ఖాతాను వెంటనే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఉద్యమం భవిష్యత్తు ఎలా ఉంటుందో తనకు కచ్చితంగా తెలియదని, కానీ దీని వెనుక ఉన్న యువత తమ శక్తిని ప్రధాన స్రవంతి రాజకీయాల్లోకి తీసుకురావాలని లేదా తమ ఓటు ద్వారా మార్పునకు గళం విప్పాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిణామం యువతలో ఉన్న అసంతృప్తికి నిదర్శనమని, ఇది ప్రతిపక్షాలకు ఒక గొప్ప అవకాశమని థరూర్ విశ్లేషించారు. ప్రతిపక్షాలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని, యువతను తమ వైపు తిప్పుకునేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.

## 'రెడ్ జోన్'లోకి చమురు సంస్థలు!

**అంతర్జాతీయంగా సంక్షోభం తలెత్తిందన్న ఐఈఏ**

**వెంటనే హర్మూజ్ జలసంధిని తెరవాలని సూచన**



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఇంధన నిల్వలు వేగంగా క్షీణిస్తుండటంతో అంతర్జాతీయ చమురు మార్కెట్లు మునుపెన్నడూ లేని విధంగా 'రెడ్ జోన్'లోకి వెళ్లే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) హెచ్చరించింది. రాబోయే సీజన్‌లో ప్రపంచవ్యాప్తంగా ప్రయాణాల డిమాండ్ భారీగా పెరగనుండటం, మరోవైపు చమురు సరఫరా నిలిచిపోవడంతో త్వరలోనే మార్కెట్లు తీవ్ర ప్రమాదకర స్థాయిలోకి ప్రవేశించబోతున్నాయని ఐఈఏ చీఫ్ ఫాతిహ్ బిరోల్ స్పష్టం చేశారు. లండన్‌లో నిర్వహించిన ప్రపంచ ఇంధన భద్రత ప్రత్యేక సదస్సులో పాల్గొన్న ఆయన... ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇరాన్ చుట్టూ నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగానే ఈ అంతర్జాతీయ ఇంధన సంక్షోభం తలెత్తిందని బిరోల్ విశ్లేషించారు. ఈ గండం నుంచి గట్టెక్కాలంటే.. గ్లోబల్ చమురు రవాణాకు అత్యంత కీలకమైన 'హర్మూజ్ జలసంధి'ని ఎలాంటి షరతులు లేకుండా, పూర్తిగా తిరిగి తెరవడమే ఏకైక పరిష్కార మార్గమని స్పష్టం చేశారు. ఒకవేళ పశ్చిమాసియా దేశాల నుంచి ప్రపంచ సరఫరాను శాసించే ఈ హర్మూజ్ జలసంధిని యథాతథంగా తెరవడంలో విఫలమైతే, గ్లోబల్ చమురు సరఫరా లింక్ పూర్తిగా కట్ అవుతుందని... దీనివల్ల వివిధ దేశాల్లో ఉన్న అత్యవసర చమురు నిల్వలు అట్టడుగు స్థాయికి పడిపోతాయని ఆయన వివరించారు.

## పాక్ చేరిన 'బొద్దింక'!

ఇస్లామాబాద్: భారత్‌లో సంచలనం సృష్టిస్తున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' డిజిటల్ ట్రెండ్ ఇప్పుడు పాకిస్థాన్‌కూ పాకింది. అక్కడ కూడా 'కాక్రోచ్ అవామీ పార్టీ', 'కాక్రోచ్ అవామీ లీగ్' వంటి కొత్త గ్రూపులు సోషల్ మీడియాలో పుట్టుకొచ్చాయి. నిరుద్యోగ యువత వేదికగా సాగుతున్న ఈ పొలిటికల్ ట్రెండ్ ఇరు దేశాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. పాక్‌లో ప్రధాన రాజకీయ పార్టీలైన ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పీటీఐ, నవాజ్ షరీఫ్ పీఎంఎల్-ఎన్, పీపీపీలకు ప్రత్యామ్నాయంగా ఈ 'కాక్రోచ్ పార్టీలు' రంగంలోకి దిగుతున్నాయి. 'కాక్రోచ్ అవామీ పార్టీ' తమ ఇన్‌స్టా బయోలో "అవును కాపీ కొట్టాం, కానీ ఎవరికి నష్టం? మా మోటో ఒక్కటే" అంటూ భారత్ నుంచి స్ఫూర్తి పొందినట్లు బాహాటంగానే అంగీకరించింది. ఈ అకౌంట్లు పూర్తిగా పాక్ నిరుద్యోగ జనరేషన్-జెడ్ యువత గొంతుకగా మారుతామని ప్రకటిస్తున్నాయి. "వ్యవస్థ ఎవరినైతే బొద్దింకలుగా భావించిందో.. మేం ఆ ప్రజల గొంతుకలం" అంటూ 'ఎలాంటి పరిస్థితుల్లోనైనా పోరాడతాం' అనే ఉర్దూ నినాదంతో పాక్ యువత సోషల్ మీడియాలో హోరెత్తిస్తోంది.

## ఎన్‌సీఈఆర్టీ కరెక్టే!

**దానికి ఆ స్వతంత్రత ఉంది**

**'అవినీతి' పాఠంపై సుప్రీం**

**విద్యావేత్తలపై నిషేధం ఎత్తివేత**



న్యూఢిల్లీ: ఎన్‌సీఈఆర్టీ 8వ తరగతి పాఠ్యపుస్తకంగా "న్యాయవ్యవస్థలో అవినీతి" అనే పాఠంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం చాలా సీరియస్ అయింది. గత ఫిబ్రవరిలో చాలా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్దేశపూర్వకంగానే న్యాయవ్యవస్థను గురించి విద్యార్థులకు తప్పుడు సందేశాన్ని పంపిస్తున్నారని ఫైర్ అయింది. దీంతో ఎన్‌సీఈఆర్టీ బహిరంగంగా క్షమాపణ చెప్పింది. అభ్యంతరకర పాఠ్యాంశాలను వెబ్‌సైట్ నుంచి తొలగించి.. పుస్తకాల పంపిణీని నిలిపివేసింది. తాజాగా సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో ముగ్గురు విద్యావేత్తలపై విధించిన నిషేధాన్ని ఉపసంహరించుకుంది. అలాగే వారు ఉద్దేశపూర్వకంగా వాస్తవాలను వక్రీకరించారన్న వ్యాఖ్యలను కూడా న్యాయస్థానం వెనక్కి తీసుకుంది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం.. ప్రొఫెసర్ మైఖేల్ డానినో, సుపర్ణ దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్‌లపై మార్చి 11న జారీ చేసిన ఆదేశాలను సవరించింది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు, విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు ఈ ముగ్గురు విద్యావేత్తలను అకడమిక్ కార్యకలాపాల నుంచి దూరంగా ఉంచాలని ఇచ్చిన ఆదేశాన్ని తాజాగా రద్దు చేసింది. 'దరఖాస్తుదారులు ఇచ్చిన వివరణను పరిశీలించిన తర్వాత.. గత ఆదేశంలోని 8వ పేరాలో ఉన్న సూచనలను సవరించడం సముచితమని భావిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ఇతర సంస్థలు స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవచ్చు' అని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. అలాగే ఈ ముగ్గురు విద్యావేత్తలు కావాలనే వాస్తవాలను తప్పుగా చూపించారన్న వ్యాఖ్యలను కూడా ధర్మాసనం వెనక్కి తీసుకుంది. వారు ఇచ్చిన వివరణల నేపథ్యంలో ఆ వ్యాఖ్యలు ఉపసంహరించుకుంటున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఫిబ్రవరి 2026లో "మన సమాజంలో న్యాయవ్యవస్థ పాత్ర" అనే అధ్యాయంలో న్యాయవ్యవస్థలో అవినీతిపై ఉన్న కొన్ని అంశాలు వివాదానికి దారితీశాయి. మీడియా కథనాల నేపథ్యంలో సుప్రీంకోర్టు స్వయంగా ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించింది. అనంతరం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఆ భాగాన్ని "అనుకోకుండా జరిగిన పొరపాటు"గా పేర్కొంటూ పుస్తకం నుంచి తొలగించింది. ఈ కేసు విచారణ సమయంలో సుప్రీంకోర్టు ఆ పుస్తకం ముద్రణ, పంపిణీపై తాత్కాలిక నిషేధం విధించింది. అలాగే పాఠ్యపుస్తకాల తయారీ, సిలబస్ రూపకల్పనలో ఈ ముగ్గురు నిపుణులను ఎట్టి పరిస్థితుల్లోనూ భాగస్వామ్యం చేయరాదని ఆదేశాలు జారీ చేసింది. తాజాగా ఆ ఆదేశాలను సుప్రీంకోర్టు సవరించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## హాఫీజ్ కుమారుడికి లష్కరే బాధ్యతలు!

**ఉగ్రసంస్థ బలోపేతానికి పాక్ ప్లాన్**

**బలూచ్ ఆర్మీతో ఒప్పందానికి అర్రులు**



ఇస్లామాబాద్: భారత సైన్యం జరిపిన 'ఆపరేషన్ సిందూర్' దెబ్బకు పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ కోలుకోలేని విధంగా దెబ్బతింది. మురిద్కేలో ఉన్న ప్రధాన శిక్షణా కేంద్రాన్ని భారత సైన్యం పూర్తిగా ధ్వంసం చేసింది. దీంతో తీవ్ర నష్టాల్లో ఉన్న ఈ ఉగ్ర సంస్థను మళ్లీ బలోపేతం చేసేందుకు ఈసారి పాకిస్థాన్ సైన్యంతో పాటు అక్కడి రాజకీయ నాయకులూ రంగంలోకి దిగారు. ఇటీవల లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ముఖ్య అనుచరుడు రాణా సనావుల్లాతో ఫైసలాబాద్‌లో భేటీ అయ్యాడు. దీనిపై భారత నిఘా సంస్థలు దృష్టి పెట్టాయి. పాక్ సైన్యం, ఐఎస్ఐపై లష్కరే ఉగ్రవాదులకు నమ్మకం సడలడంతోనే.. పాక్ ప్రభుత్వం నేరుగా రాజకీయ నేతలను రంగంలోకి దించి ఈ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. లష్కరే తోయిబాకు కొత్త నాయకుడిని అధికారికంగా ప్రకటించాలని పాక్ రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం 75 ఏళ్ల హాఫీజ్ సయీద్ వయసు పైబడటం, సంస్థలో తీవ్ర అసంతృప్తి నెలకొనడంతో నాయకత్వ సంక్షోభం ఏర్పడింది. అందుకే 50 ఏళ్ల తల్హా సయీద్‌ను అధికారికంగా ఆపరేషన్స్ చీఫ్‌గా మార్చాలని చూస్తున్నారు. కొత్త టెక్నాలజీలపై పట్టున్న తల్హా అయితేనే ఉగ్రవాదులను నడిపించగలడని పాక్ భావిస్తోంది. అటు.. పాకిస్తాన్‌కు బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తూంక్వా ప్రాంతాల్లో భద్రత కల్పించడం పెద్ద సవాలుగా మారింది. ముఖ్యంగా బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ దాడులతో పాక్ సైన్యం తీవ్రంగా నష్టపోతోంది. బీఎల్ఏ గ్రూపులు పాక్ ప్రభుత్వం లేదా సైన్యంతో చర్చలకు అస్సలు అంగీకరించవు. అందుకే లష్కరే తోయిబా నేతలను రాయబారానికి పంపి బీఎల్ఏతో ఒప్పందం కుదుర్చుకోవాలని చూస్తోంది. బలూచిస్థాన్ మీదుగా వెళ్లే 'చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్' ఫేజ్-2 ప్రాజెక్ట్‌కు భద్రత కల్పించడం పాక్‌కు కీలకం. బలూచిస్థాన్‌లోని మైనింగ్ ప్రాజెక్ట్ కోసం అమెరికా 1.3 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టింది. స్థానిక వనరులను దోచుకుంటున్నారంటూ బలూచ్ ప్రజలు ఈ ప్రాజెక్టులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమ పెట్టుబడుల భద్రతపై చైనా, అమెరికా నుంచి ఒత్తిడి రావడంతోనే పాక్ ప్రభుత్వం లష్కరే తోయిబాను ఆశ్రయించింది.

## స్టాక్ మార్కెట్లకు లాభాలు



ముంబై: అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు జరగవచ్చన్న ఆశాజనక సంకేతాల నేపథ్యంలో శుక్రవారం ఉదయం భారత స్టాక్ మార్కెట్లు లాభాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల పవనాలు సూచీలకు మద్దతునిచ్చాయి. ఉదయం 9:23 గంటల సమయానికి సెన్సెక్స్ 307 పాయింట్లు (0.41 శాతం) లాభపడి 75,491 వద్ద ట్రేడ్ అవుతుండగా, నిఫ్టీ 89 పాయింట్లు (0.38 శాతం) పెరిగి 23,744 వద్ద కొనసాగుతోంది. ప్రధాన సూచీలు లాభాల్లో ఉన్నప్పటికీ, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మిశ్రమంగా స్పందించాయి. రంగాల వారీగా చూస్తే.. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు 0.75 శాతం వరకు లాభపడ్డాయి. మరోవైపు, నిఫ్టీ మీడియా, రియల్టీ రంగాలు 0.80 శాతం పైగా నష్టాలతో ట్రేడ్ అయ్యాయి. మార్కెట్ కొద్దిగా తగ్గినప్పుడు కొనుగోళ్లు, పెరిగినప్పుడు అమ్మకాల ధోరణి కనిపిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 105 డాలర్ల కంటే దిగువకు రావడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 96.20కి బలపడటం వంటివి మార్కెట్‌కు సానుకూల అంశాలుగా నిలుస్తున్నాయి. మధ్యప్రాచ్యంలో శాంతి ఒప్పందం కుదిరే అవకాశాలున్నాయన్న అంచనాలతో ఆసియా, అమెరికా మార్కెట్లు కూడా లాభాల్లో ట్రేడ్ అవుతున్నాయి. అయితే, అణు కార్యక్రమం విషయంలో ఇరాన్ వైఖరి కారణంగా అమెరికాతో ఒప్పందం కుదరడంలో సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నివేదికలు చెబుతున్నాయి. గురువారం నాటి ట్రేడింగ్‌లో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ. 1,891 కోట్ల విలువైన షేర్లను నికరంగా అమ్మగా, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ. 2,492 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు.



## అంజన్న ఆదాయం రూ.1.08 కోట్లు

మల్యాల, మే 22 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు పెద్ద మొత్తంలో విరాళాలు సమర్పించారు. గత 34 రోజుల హుండీ ఆదాయం ఏకంగా రూ.1,08,64,164 సమకూరినట్లు ఈవో అంజనారెడ్డి తెలిపారు. హుండీ ఆదాయ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓ హరిహరనాథ్, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రాజమౌళి, ఉపప్రధాన అర్చక మారుతి ప్రసాద్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ధర్మేందర్, శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్, ఏఎస్సై శ్రీనివాస్, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులు, తిరుపతి అన్నమయ్య సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## సేంద్రియం వైపు మళ్లాలి: వ్యవసాయ శాస్త్రవేత్తలు

మల్యాల, మే 22 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన '99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా శుక్రవారం మల్యాల మండలంలోని తాటిపెల్లి గ్రామ వ్యవసాయ క్లస్టర్ వేదికలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు–అన్నదాతల అవగాహన" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్త ఎన్ సాయినాథ్ మాట్లాడుతూ, యూరియా వినియోగాన్ని తగ్గించి పశువుల పేడ వంటి సేంద్రియ ఎరువులను ఉపయోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. వానకాలం పంటలు వేసే ముందు భూమిని అధికంగా కల్చడం వల్ల నేలలోని వానపాములు, సూక్ష్మజీవులు నశించి మొక్కలకు అవసరమైన పోషకాలు తగ్గిపోతాయని తెలిపారు. సాగునీటిని ఆదా చేస్తూ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని రైతులకు సూచించారు. మల్యాల మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్ మాట్లాడుతూ, రానున్న వానకాలం సీజన్‌లో సాంబ మసూరి, తెలంగాణ సోనా, కూనారం వరి–2, జగిత్యాల సన్నాలు, జైశ్రీరామ్, హెచ్ఎంటీ సోనా వంటి సన్నరకం వరి వంగడాలను సాగు చేయాలని రైతులకు సూచించారు. సన్న వరి ధాన్యం సాగు ద్వారా అధిక లాభాలు పొందడంతో పాటు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కే శ్రీనివాస్, తాటిపెల్లి ఉపసర్పంచ్ లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు––అన్నదాతల అవగాహన" పోస్టర్‌ను ఆవిష్కరించారు.



## జూబ్లీహిల్స్ టీబీజేఏసీ చైర్మన్‌గా కొల్లిపర నాగరాజు

జూబ్లీహిల్స్, మే 22 (ఈవార్తలు): తెలంగాణ బస్తీల జాయింట్ యాక్షన్ కమిటీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ కమిటీని పునర్వ్యవస్థీకరించినట్లు సంస్థ చైర్మన్ గోసుల శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. యూసుఫ్‌గూడలో నిర్వహించిన కార్యక్రమంలో కొల్లిపర నాగరాజును నియోజకవర్గ చైర్మన్‌గా నియమించి, నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి మాగంటి సునీత, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొల్లిపర నాగరాజు మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి బస్తీల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీబీజేఏసీ వైస్ చైర్మన్ సల్లా శ్రీనివాస్ యాదవ్, అమ్మాజీ, అశోక, షబ్బీర్, రవి కళ్యాణ్, ప్రసాద్ చౌదరి, శ్రీనివాస్ రెడ్డి, శ్రావణ్, నాగు, ఇస్మాయిల్ సహా పలువురు నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

## 65 లక్షల సివిల్ వివాదంలో పోలీసులు

**ఐజీని ఆశ్రయించిన ఖమ్మం మహిళ**

ఖమ్మం, మే 22 (ఈవార్తలు): ఖమ్మం నగరానికి చెందిన ఓ మహిళ తనను పోలీసులు వేధిస్తున్నారంటూ మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డిని ఆశ్రయించారు. బాధితురాలు నల్లమోతు కుసుమ తెలిపిన వివరాల ప్రకారం, 2016–17లో ఏన్కూరు గ్రామానికి చెందిన భువనేశ్వర్ రాజు, వీరబాబులు కలిసి కాంట్రాక్ట్ పనులు నిర్వహించగా బిల్లుల విషయంలో వివాదాలు తలెత్తాయి. ఈ క్రమంలో మధ్యవర్తిత్వం వహించిన ఆమె, 2025లో రూ.65 లక్షలకు సంబంధించి షూరిటీగా బాండ్‌పై సంతకం చేసినట్లు తెలిపింది. అయితే బిల్లులు రాకపోవడంతో వివాదం మరింత ముదిరిందని, కొందరు వ్యక్తులు మరియు పోలీసుల ద్వారా పలుమార్లు స్టేషన్లకు పిలిపించి ఒత్తిడి తెచ్చారని ఆరోపించింది. ఇంట్లో నిర్బంధించి బెదిరింపులకు పాల్పడ్డారని కూడా ఫిర్యాదులో పేర్కొంది. ఇటీవల టౌన్ ఏసీపీ కార్యాలయంలో పంచాయతీకి హాజరు కావాలని పిలిచారని, అనంతరం మరోసారి అర్బన్ పోలీస్ స్టేషన్‌కు రావాలని సూచించడంతో ఐజీని ఆశ్రయించినట్లు తెలిపింది. ఫిర్యాదుపై స్పందించిన ఐజీ, విషయాన్ని పరిశీలించాలని ఖమ్మం పోలీస్ కమిషనర్‌కు సూచించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు వంటి సివిల్ వ్యవహారాల్లో పోలీస్ స్టేషన్లలో పంచాయతీలు నిర్వహించడం చట్టపరంగా సరైంది కాదని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

## నాగేశ్వర్‌ను అరెస్టు చేస్తే సీఎం అభ్యర్థి అవుతాడు

**సీపీఐ నారాయణ**

విజయవాడ, మే 22 (ఈవార్తలు): ప్రొఫెసర్ నాగేశ్వర్ రావుపై జనసేన పార్టీ నేతలు కేసులు పెడుతుండడంపై సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి కె. నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రొఫెసర్‌ను అరెస్ట్ చేయిస్తే ఆయన ఏకంగా ఒక ముఖ్యమంత్రి అభ్యర్థిగా బయటకు వస్తారని, దేశంలో ప్రస్తుతం పెరుగుతున్న 'కాక్రోచ్ ఉద్యమం' ఇక్కడ కూడా ఉప్పెనలా మారుతుందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రొఫెసర్ నాగేశ్వర్ రావుపై కేసులు పెట్టాలని జనసేన నేతలు నిర్ణయించినట్లు తెలుస్తోందని నారాయణ పేర్కొన్నారు. ఇది ఒక రకంగా ప్రొఫెసర్‌ను భయపెట్టాలని చూసే 'బ్లాక్‌మెయిల్' రాజకీయమేనని ఆయన మండిపడ్డారు. సోషల్ మీడియాలో అయినా, బయట అయినా ఎవరి వాదనలు, అభిప్రాయాలు వాళ్లకు ఉంటాయని.. ప్రజాస్వామ్యంలో దానికి సమాధానం కూడా వాదనతోనే ఇవ్వాలి తప్ప, ఇలా వరుసగా కేసులు పెట్టడం బెదిరింపులకు పాల్పడటమే అవుతుందని నారాయణ వ్యాఖ్యానించారు. సమాజంలో తమకు వ్యతిరేకంగా మాట్లాడేవాళ్లను, ప్రభుత్వాన్ని ప్రశ్నించేవాళ్లను

# విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయం వద్దు

## కేవీ కోసం 5 ఎకరాలు కేటాయించాలి.. బీజేపీ జగిత్యాల ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి

జగిత్యాల, మే 22 (ఈవార్తలు): జగిత్యాల, జిల్లాలో విద్యార్థుల భవిష్యత్తు అంశంలో రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం కనీసం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎంపీ ధర్మపురి అర్వింద్ కృషితో జిల్లాలో నవోదయ విద్యాలయం విజయవంతంగా కొనసాగుతోందని, ఇప్పుడు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉందన్నారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం కనీసం ఐదు ఎకరాల భూమి అవసరమని, చల్‌గల్ ప్రాంతంలోని స్థలం అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. రెండు ఎకరాల స్థలం కేటాయిస్తే ప్రతిపాదనలు తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉన్నప్పటికీ, అదే ప్రతిపాదించడం సరైంది కాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రజాప్రతినిధులు రాజకీయాలను పక్కన పెట్టాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కనీసం 20 ఎకరాల స్థలం అవసరమని, విద్యా రంగంలో సరైన ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. జగిత్యాల మున్సిపాలిటీలో కేంద్రం నుంచి వచ్చిన రూ.62 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భారీ అవకతవకలు జరిగాయని ఆమె ఆరోపించారు. ఇప్పటికే పూర్తయిన పనులకు మళ్లీ టెండర్లు పిలుస్తున్నారని, 1 నుంచి 48 వార్డుల వరకు జరిగిన అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. చెట్ల పేరుతో డివైడర్ల మార్పులు, అభివృద్ధి పనులు, 2బీహెచ్‌కే ఇళ్ల నిర్మాణాలు సహా ఎమ్మెల్యే హయాంలో చేపట్టిన అన్ని పనులపై సమగ్ర దర్యాప్తు




జరపాలని కోరారు. యావర్ రోడ్డు విస్తరణ అంశంపై కూడా ఆమె స్పందిస్తూ, టీడీఆర్ తీర్మానం ఆమోదమైనా పనులు ఎందుకు ప్రారంభం కాలేదని ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే యావర్ రోడ్డు విస్తరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, కౌన్సిలర్ నిమ్మల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్, ఆముదరాజు, పవన్ సింగ్, గదాసు రాజేందర్, గడ్డల లక్ష్మి తదితర నాయకులు పాల్గొన్నారు.

# ముదిరాజ్‌లకు గుర్తింపు దక్కాలి: జీవన్ రెడ్డి

జగిత్యాల రూరల్, మే 22 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం హబ్సిపూర్ గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి పట్నాలు, బోనాల పండుగ కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి, యువజన నాయకుడు తాటిపర్తి సీకే రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, కాయకష్టానికి ప్రతీక ముదిరాజ్ సోదరులని పేర్కొన్నారు. పెద్దమ్మ తల్లి ఆశీర్వాదాలతో వారు చేసే కష్టానికి తగిన ఆర్థిక ఫలితం దక్కాలని, వారి జీవితాల్లో కష్టాలు తొలగిపోవాలని ఆకాంక్షించారు. పెద్దమ్మ తల్లి దీవెనలు ఎల్లప్పుడూ అందరిపై ఉండాలని కోరారు. పెద్దమ్మ తల్లి బోనాల కార్యక్రమం కేవలం ముదిరాజ్ కులానికే పరిమితం కాకుండా యావత్ సమాజానికి ఆశీర్వాదాలు అందించేలా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన వర్గాల్లో ముదిరాజ్ కులస్తులు ఒకరని, వారి ప్రధాన జీవనాధారం మత్స్య వృత్తి అని తెలిపారు. గ్రామాల్లో చెరువులు, కుంటల ఆధారంగా జీవిస్తున్న మత్స్యకారులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాల్సిన



అవసరం ఉందన్నారు. చేపనారును సమయానికి అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలో వందల సంఖ్యలో చెరువులు ఉన్నప్పటికీ, అన్ని మత్స్య సహకార సంఘాలకు సమానంగా ప్రయోజనం అందడం లేదని అన్నారు. చెరువుల విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకుని మత్స్య సహకార సంఘాలకు నేరుగా చేపనారు అందిస్తే, వారు అవసరానికి అనుగుణంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతు కుటుంబాల సంక్షేమంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని సూచించారు. హబ్సిపూర్ ముదిరాజ్ సోదరులు ఆహ్వానించి పెద్దమ్మ తల్లి ఆశీర్వాదాలు పొందే అవకాశం కల్పించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



## కుటుంబ సమస్యలతో కేటీఆర్‌లో అసహనం: అడ్లూరి

జగిత్యాల, మే 22 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కుటుంబ సమస్యల కారణంగానే అసహనంతో మాట్లాడుతున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వ్యాఖ్యానించారు. శుక్రవారం జగిత్యాల జిల్లాలో నిర్వహించిన ప్రజాపాలన––ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కుటుంబ వ్యవహారాల కారణంగా కేటీఆర్ అసహనానికి గురవుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తన మాటలపై నియంత్రణ పాటించాలని, లేకపోతే రాష్ట్రంలోని కాంగ్రెస్ కార్యకర్తలు తగిన విధంగా స్పందించే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రిని ఏకవచనంతో సంబోధించడం సమంజసం కాదని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకు విశ్వాసం తగ్గిందని, మరో 20 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగుతుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదవిలో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ వ్యక్తిగత విమర్శలకు దిగలేదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం వల్ల రాజకీయంగా గొప్పతనం రాదని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎస్సీ, బీసీ, మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించిన మంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, బీసీ, మైనార్టీల బిల్లులకు రూ.1,000 కోట్ల చెల్లింపులు చేసినట్లు తెలిపారు.

**అనంతబాబు బెయిల్ పిటిషన్ కొట్టివేత**

రాజమండ్రి, మే 22 (ఈవార్తలు): డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు రాజమండ్రి స్పెషల్ కోర్టులో తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. సాక్షులను బెదిరించిన కేసులో తనకు రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది. తనకు అనుకూలంగా సాక్ష్యం చెప్పకపోతే చంపేస్తానంటూ ఈ కేసులోని నలుగురు కీలక సాక్షులను అనంతబాబు బెదిరించినట్లు బాధితులు సర్పవరం పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఏప్రిల్ 24న ఆయన్ను అరెస్ట్ చేయగా.. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మరోవైపు, డ్రైవర్ సుబ్రమణ్యం హత్యకేసులో సాక్షుల విచారణ కోర్టులో వేగంగా సాగుతోంది. కీలక సాక్షులైన మణికంఠ, శివదుర్గాప్రసాద్‌లు ఘటన జరిగిన సమయంలో తాము చూసిన వివరాలను జడ్జికి వివరించగా, కోర్టు వారి వాంగ్మూలాలను రికార్డు చేసింది.

# రెండు నెలలైనా ధాన్యం కొనరా?

**రైతులతో ఆడుకుంటున్నారు : దావ వసంత**

జగిత్యాల రూరల్/సారంగపూర్, మే 22 (ఈవార్తలు): రైతులు నాలుగు నెలలు కష్టపడి పంట పండిస్తే, వాటిని విక్రయించడానికి కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు నెలలు పడుతోందని జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ విమర్శించారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట, సారంగాపూర్ మండలం ఆర్పెల్లి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు, నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత, లారీ రవాణా సమస్యలు ఉన్నాయని రైతులు చెబుతున్నారని, అధికారులు వెంటనే స్పందించి



కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. కేసీఆర్ హయాంలో ఈ సమయానికి కొనుగోళ్లు పూర్తయ్యేవని, కానీ ప్రస్తుతం సగం వరకు కూడా కొనుగోళ్లు జరగలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతు బీమా, 24 గంటల నాణ్యమైన విద్యుత్ వంటి పథకాల ద్వారా రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హామీలకే పరిమితమై కాలయాపన చేస్తోందని విమర్శించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వానికి రైతులే తగిన సమయంలో సమాధానం చెబుతారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌రావు, సాగి సత్యం రావు, తిరుపతి, ఎండబెట్ల ప్రసాద్, రవీందర్ రావు, రాజన్న, బోగ గంగారం, రవీందర్ రెడ్డి, తోట మహేందర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.



## అర్ధరాత్రి ఎస్పీ ఆకస్మిక పెట్రోలింగ్

జగిత్యాల, మే 22 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం రాత్రి వేళ నిఘాను మరింత బలోపేతం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలు, దొంగతనాలను అరికట్టేందుకు బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ వాహనాలతో నిరంతర గస్తీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే నైట్ బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఎస్పీ జగిత్యాల, కోరుట్ల, మేడిపల్లి ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి పెట్రోలింగ్ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రాత్రి సమయంలో సమర్థవంతమైన పెట్రోలింగ్ ద్వారా ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. సమయానుకూలంగా స్పందించడం ద్వారా నేరాలను ముందుగానే అరికట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలను నియంత్రించేందుకు రాత్రి నిఘాను మరింత పటిష్టం చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## అగ్నిప్రమాదంలో 2000 వేల ఈత చెట్లు బుగ్గి

**31 గౌడ కుటుంబాల ఉపాధిపై దెబ్బ**

**బాధితులకు మాజీ ఎమ్మెల్యే సుంకె పరామర్శ**

కొడిమ్యాల, మే 22 (ఈవార్తలు): కొడిమ్యాల మండలం కోనాపూర్ గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో దాదాపు 2 వేల ఈతచెట్లు కాలిపోవడంతో గీత వృత్తిపై ఆధారపడిన 31 గౌడ కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శుక్రవారం బాధిత కుటుంబాలను పరామర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగ్నిప్రమాదంతో తీవ్రంగా నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. నష్టంపై పూర్తిస్థాయి సర్వే నిర్వహించి బాధితులకు తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు కొత్త ఈతచెట్లు మంజూరు చేసి తాటివనాల పునరుద్ధరణ చేపట్టాలని కోరారు. ఎండాకాలంలో ఇటువంటి అగ్నిప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు కృష్ణారావు, వెంకటేశం, స్వామిరెడ్డి, రాజేందర్, సురుగు శ్రీనివాస్, బుర్ర సంతోష్, గౌడ కులస్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తిరుమల కొండపై భక్తుల కిటకిట

తిరుమల, మే 22 (ఈవార్తలు): కలియుగ దైవం తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. వేసవి సెలవులు కావడంతో దేశం నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తుండటంతో తిరుమల గిరులు భక్తజన సంద్రంగా మారాయి. రద్దీ విపరీతంగా పెరగడంతో శ్రీవారి సర్వదర్శనానికి గంటల తరబడి సమయం పడుతోంది. ప్రస్తుతం తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఉన్న అన్ని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూ లైన్లు శ్రీవారి సేవా సదన్ వరకు విస్తరించాయి. ఎటువంటి టోకెన్లు లేని భక్తులకు స్వామివారి సర్వదర్శనం కోసం దాదాపు 18 నుంచి 24 గంటల సమయం పడుతోంది. గురువారం నాడు శ్రీవారిని 79,603 మంది భక్తులు దర్శించుకున్నారు. 45,125 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా శ్రీవారి హుండీ ఆదాయం కూడా భారీగా నమోదైంది. నిన్న ఒక్కరోజే స్వామివారికి హుండీ ద్వారా రూ.4.35 కోట్ల ఆదాయం వచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు.

వయ్యారి చిత్రం




## వెంకీ సరసన నివేదా పేతురాజ్



మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సినిమాలో హీరోయిన్ కంటే, సెకండ్ హీరోయిన్‌కు ఎక్కువ క్రేజ్ వస్తుంది. ఎందుకంటే మొదటి నుంచి ఈ డైరెక్టర్ ఎక్కువ సెకండ్ హీరోయిన్ మీదనే ఫోకస్ చేస్తాడు. ఈయన సినిమా వస్తుంది అంటే సెకండ్ హీరోయిన్ కంపల్సరీ అన్నా మాట. ఈ క్రమంలోనే 'అల వైకుంఠపురం'లో పూజా హెగ్డే కంటే ఎక్కువ అభిమానుల దృష్టిని ఆకర్షించిన నివేదా పేతురాజ్‌ను ఇప్పుడు మరోసారి తన సినిమాలో భాగం చేయాలనుకుంటున్నాడట ఈ డైరెక్టర్. ప్రస్తుతం త్రివిక్రమ్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఆదర్శ కుటుంబం'. విక్టరీ వెంకటేష్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో హీరోయిన్‌గా పాన్ ఇండియా బ్యూటీ శ్రీనిధి శెట్టిని ఫిక్స్ చేసినట్లు తెలుస్తుండగా.. సెకండ్ హీరోయిన్‌గా నివేదా పెతురాజ్‌ను ఫైనల్ చేసినట్లు టాక్. ఇప్పటికే అల.. వైకుంఠపురంలో సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నివేదా కనిపించగా ఇప్పుడు ఈ చిత్రంలో కూడా తీసుకున్నట్లు తెలుస్తుంది. అయితే.. దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది.

## కిక్కెక్కించేలా చరణ్, శృతి స్టెప్పులు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం పెద్దిపై రోజురోజుకు అంచనాలు మరింత పెరుగుతున్నాయి. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో స్పోర్ట్స్ డ్రామాగా దర్శకుడు బుచ్చిబాబు సనా రూపొందిస్తున్న ఆ సినిమాకు సంబంధించిన ప్రతి అప్డేట్ కూడా సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో వైరల్ అవుతోంది. తాజాగా మూవీ టీమ్ విడుదల చేసిన స్పెషల్ సాంగ్ ప్రోమో ఇప్పుడు అభిమానుల్లో కొత్త జోష్ నింపుతోంది. హెల్లల్లలో అంటూ రానున్న స్పెషల్ సాంగ్ కు సంబంధించిన చిన్న ప్రోమోను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఇందులో రామ్ చరణ్ తోపాటు స్టార్ బ్యూటీ శృతి హాసన్ కనిపించడంతో ఒక్కసారిగా సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. ముఖ్యంగా వీరిద్దరి డ్యాన్స్ మూవ్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మాస్ బీట్ కు తగ్గట్టుగా వేసిన స్టెప్పులు పాటపై అంచనాలను మరింత పెంచేశాయి. కంప్లీట్ సాంగ్ మార్చి 23న విడుదల కానుండగా, రేపు భోపాల్ లో నిర్వహించనున్న భారీ మ్యూజికల్ ఈవెంట్ లో రిలీజ్ చేయనున్నారు. ఆ పాటకు ప్రముఖ గేయ రచయిత అనంత్ శ్రీరామ్ లిరిక్స్ అందించగా, ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చారు. ఇప్పటికే రెహమాన్ సంగీతం అంటే ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. ఇప్పుడు అది స్పెషల్ సాంగ్ కావడంతో మరింత హైప్ ఏర్పడింది. ఫోక్ టచ్ తో పాటు మాస్ బీట్ కలిసి కంపోజ్ చేసినట్లు ప్రోమోను చూస్తే అర్థమవుతోంది. ముఖ్యంగా చరణ్ స్క్రీన్ ప్రెజెన్స్, శృతి గ్లామర్ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇక ఈఆ పాటలో మరో హీరోయిన్ కూడా కనిపించనున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.



## త్రిష అలిగిందా..!



టాలీవుడ్‌లో తిరుగులేని బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించి.. ప్రస్తుతం దర్శకుడిగా వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు అగ్ర నిర్మాత ఎమ్ఎస్ రాజు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం -అగధ- త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా మీడియా ఇంటర్వ్యూలలో పాల్గొంటున్న ఆయన తన సుదీర్ఘ సినీ ప్రయాణంలోని ఎన్నో ఆసక్తికరమైన జ్ఞాపకాలను అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఒకప్పటి స్టార్ హీరోయిన్ త్రిషతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని.. ఒక సినిమా షూటింగ్ సమయంలో జరిగిన సరదా సంఘటనను తాజాగా గుర్తు చేసుకున్నారు. ఎమ్ఎస్ రాజు నిర్మాణంలో సిద్ధార్థ్- త్రిష కాంబినేషన్‌లో వచ్చిన -నువ్వొస్తానంటే నేనొద్దంటానా- చిత్రం ఎంతటి ఘనవిజయం సాధించిందో అందరికీ తెలిసిందే.




## వేధింపులు ఎక్కువయ్యాయి

టాలీవుడ్ సెలబ్రిటీలు అనసూయ, విష్ణుప్రియ పోలీసులకు వేర్వేరుగా శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఒకరు నేరుగా స్టేషన్‌కెళ్లి కంప్లైట్ చేయగా.. మరొకరు సోషల్ మీడియా వేదికగా ట్యాగ్ చేశారు. ఏం జరిగిందంటే? తన గురించి తప్పుడు ప్రచారం చేస్తోందంటూ ఓ యూట్యూబ్ ఛానల్‌పై మియాపూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు విష్ణుప్రియ. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. "ఆమె కూడా ఓ అమ్మాయి (విష్ణుప్రియ గురించి మాట్లాడిన అమ్మాయి). అయినా, ఇండస్ట్రీకి చెందిన మహిళల గురించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతోంది. ఆమెపై చర్యలు తీసుకోవాలనుకున్నా. అందులో భాగంగానే కంప్లైట్ ఇచ్చా. ఆమే కాదు ఇలా చాలామంది ఉన్నారు. వారిపైనా యాక్షన్ తీసుకుంటా" అని హెచ్చరించారు.

## అందరికీ చెప్పే పెళ్లి చేసుకుంటా: కంగనా

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్, నటి – పార్లమెంట్ సభ్యురాలు కంగనా రనౌత్ నిరంతరం ఏదో ఒక విషయంతో వార్తల్లో నిలుస్తూనే ఉంటారు. తాజాగా కంగన మెడలో మంగళసూత్రం ధరించి ఉన్న కొన్ని ఫోటోలు సోషల్ మీడియా వేదికగా విపరీతంగా వైరల్ అయ్యాయి. ఈ ఫోటోలను చూసిన నెటిజన్లు – అభిమానలోకం ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. కంగనా ఎవరికీ చెప్పకుండా రహస్యంగా పెళ్లి చేసుకుందా? అంటూ నెట్టింట పెద్ద ఎత్తున చర్చలు, పుకార్లు మొదలయ్యాయి. గత కొన్ని రోజులుగా క్వీన్ వివాహం గురించి రకరకాల వార్తలు వస్తున్న సమయంలో ఈ మంగళసూత్రం ఫోటోలతో ఆ రూమర్లకు మరింత ఆజ్యం పోసినట్లయింది. ఈ వైరల్ ఫోటోల వెనుక ఉన్న అసలు నిజాన్ని పరిశీలిస్తే.. కంగనకు నిజంగా పెళ్లి కాలేదనే విషయం స్పష్టమవుతోంది.



## చియాన్ కొడుకుతో జాన్వీ



భారతీయ చలనచిత్ర రంగాన్ని ఒక ఊపు ఊపిన దివంగత అతిలోక సుందరి శ్రీదేవి కుమార్తెగా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి, ఆపై టాలీవుడ్‌లోనూ తన అదృష్టాన్ని పరీక్షించుకున్న జాన్వీ కపూర్ ఇప్పుడు అధికారికంగా తమిళ చిత్రసీమలోకి (కోలీవుడ్) అడుగుపెట్టబోతోందన్న వార్త ఇండస్ట్రీ వర్గాలలో హాట్ టాపిక్‌గా మారింది. విలక్షణ నటుడు, చియాన్ విక్రమ్ కుమారుడైన యువ హీరో ధ్రువ్ విక్రమ్ సరసన యంగ్ బ్యూటీ తన తొలి తమిళ చిత్రంలో నటించనున్నారు. ఈ ఇద్దరు స్టార్ కిడ్స్ తొలిసారి జంటగా నటిస్తుండటంతో సౌత్ సినీ ప్రేమికుల్లో ఈ ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే కోలీవుడ్ అగ్ర దర్శకుడు మారి సెల్వరాజ్ వంటి వైవిధ్యమైన దర్శకుడితో ఒక భారీ సినిమాను పూర్తి చేసిన ధ్రువ్ విక్రమ్ తన తదుపరి ప్రాజెక్ట్‌ను మరో క్రేజీ దర్శకుడితో లైన్‌లో పెట్టారు. కవిన్ హీరోగా ఘనవిజయం సాధించిన -దాదా- చిత్ర దర్శకుడు గణేష్ కె. బాబు ఈ సరికొత్త రొమాంటిక్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించనున్నారు. ఈ తరం యూత్‌కు కనెక్ట్ అయ్యేలా.. ఒక అందమైన యూత్‌ఫుల్ లవ్ స్టోరీగా సరికొత్త కోణంలో సాగే కథాంశంతో దర్శకుడు ఈ స్క్రిప్ట్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.



## కేన్స్‌లో ఐశ్వర్య మెరుపులు!

ప్రపంచ సినీ అభిమానుల దృష్టిని ఆకర్షించే ప్రతిష్ఠాత్మక కేన్స్ చలనచిత్రోత్సవం ప్రతి ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ వేడుకల్లో బాలీవుడ్ స్టార్ నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్ ఎప్పుడూ తన ప్రత్యేక శైలి, అద్భుతమైన దుస్తులతో అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటారు. అయితే ఈసారి ఆమె కేన్స్ వేడుకలకు హాజరుకావడం లేదంటూ గత కొద్ది రోజులుగా సామాజిక మాధ్యమాల్లో పలు వార్తలు వైరల్ అయ్యాయి. ఈ ప్రచారంతో అభిమానుల్లో నిరాశ నెలకొనగా, ఇప్పుడు ఆ ఊహాగానాలకు ఐశ్వర్య స్వయంగా తెరదించారు. తాజాగా ఆమె తన కుమార్తెతో కలిసి ఫ్రాన్స్ చేరి రెడ్ కార్పెట్‌పై హొయలు పోయింది.







# సన్‌రైజర్స్ జయభేరి

## అయినా మూడో స్థానంలోనే.. క్వాలిఫయర్1లో ఆర్సీబీ, గుజరాత్

భారీ విజయంతో క్వాలిఫయర్ 1 ఆడాలనుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆశలపై ఆర్సీబీ నీళ్లు చల్లింది. ఉప్పల్‌లో 256 పరుగులు ఛేదనలో ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్(44) అదిరే ఆరంభమివ్వగా.. కృనాల్ పాండ్యా(41 నాటౌట్) జతగా పటిదార్(56) కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు.

**సన్‌రైజర్స్ బౌలర్లు గొప్పగా రాణించినా ఆర్సీబీని 165లోపు కట్టడి చేయలేకపోయారు. దాంతో.. హైదరాబాద్ మూడో స్థానానికే పరిమితమైంది. ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్‌కు బౌలర్లు భారీ స్కోర్ సమర్పించుకోగా.. ఆర్సీబీకి ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్(44) అదిరే ఆరంభమిచ్చాడు.**

శివాంగ్ ఓవర్లో మూడు సిక్సర్లు, ఫోర్‌తో ఏకంగా 23 పరుగులు పిండుకున్నాడు. ప్రమాదకరంగా మారిన అయ్యర్‌ను మలింగ బోల్తా కొట్టించాడు. సిక్సర్‌కు యత్నించిన అయ్యర్ మిడాన్‌లో అభిషేక్ చేతికి చిక్కాడు. కాసేపటికే షకీబ్ ఓవర్లో కవర్స్‌లో ఆడిన విరాట్ కోహ్లీ(15) స్మరణ్ చేతికి చిక్కాడు. దాంతో. పవర్ ప్లేలో ఆర్సీబీ 2 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. కీలక వికెట్లు పడడంతో పడిక్కల్, పటిదార్ ఇన్నింగ్స్ నిర్మించాలనుకున్నారు. కానీ, పడిక్కల్‌ను ఔట్ చేసి రెండో వికెట్ సాధించాడు మలింగ. ఆ తర్వాత కృనాల్ పాండ్యా(41 నాటౌట్) జతగా పటిదార్(56) .. సన్‌రైజర్స్ క్వాలిఫయర్ 1 అవకాశాల్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఆడాడు. పెద్ద షాట్లకు వెళ్లకుండావికెట్ కాపాడుకుంటూ స్ట్రయిక్ రొటేట్ చేశారు. పార్ట్ టైమ్ బౌలర్ హెడ్ ఓవర్లో పాటిదార్ పెద్ద షాట్ ఆడి బౌండరీ వద్ద చిక్కాడు. 55 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ జయభేరి మోగించింది. క్వాలిఫయర్ 1 పై కన్నేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ టాపార్డర్ విధ్వంసంతో కొండంత స్కోర్ కొట్టింది. ఉప్పల్ స్టేడియంలో అభిషేక్ శర్మ(56) మెరుపు ఆరంభాన్నివ్వగా.. ఇషాన్ కిషన్(79), క్లాసెన్(51) జోడీ తర్డ శతకాలతో ఆర్సీబీ బౌలర్ల భరతం పట్టింది. వీరిద్దరూ శతక భాగస్వామ్యం నెలకొల్పగా.. డెత్ ఓవర్లలో నితీశ్ రెడ్డి(29 నాటౌట్) సిక్సర్లతో రెచ్చిపోగా హైదరాబాద్ ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| బెంగళూరు | 14 | 9 | 5 | 18 |
| గుజరాత్ | 14 | 9 | 5 | 18 |
| హైదరాబాద్ | 14 | 9 | 5 | 16 |
| రాజస్థాన్ | 13 | 7 | 6 | 14 |
| పంజాబ్ | 13 | 6 | 6 | 13 |
| కోల్‌కతా | 13 | 6 | 6 | 13 |
| చెన్నై | 14 | 6 | 8 | 12 |
| ఢిల్లీ | 13 | 6 | 7 | 12 |
| ముంబై | 13 | 4 | 9 | 8 |
| లక్నో | 13 | 4 | 9 | 8 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓడినవి పా-పాయింట్లు



## వైభవ్ దెబ్బ.. బీహార్‌కూ ఐపీఎల్ టీం ఉండాలె!

ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ సిక్సర పిడుగు దుమ్మురేపుతున్నాడు. తనకే సాధ్యమైన విధ్వంసకర బ్యాటింగ్‌తో రికార్డుల మోత మోగిస్తున్నాడు. బిహార్‌కు చెందిన ఈ 15 ఏళ్ల కుర్రాడు తన బ్యాటింగ్‌తో యావత్ క్రికెట్ ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యానికి గురిచేస్తున్నాడు. ఇలాంటి ఆటగాడిని అందించిన బిహార్‌కు ఓ ఐపీఎల్ జట్టు ఉండాలని బిలియనీర్ అనిల్ అగర్వాల్ డిమాండ్ చేశారు. భారత్‌లోనే అతిపెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఒకటైన వేదాంతా గ్రూప్‌నకు అనిల్ అగర్వాల్ ఛైర్మన్. ఆయన తాజాగా చేసిన సోషల్ మీడియా పోస్ట్ తీవ్ర చర్చనీయాంశమైంది. 'ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ తరహాలోనే బిహార్‌కు కూడా అద్భుతమైన ఐపీఎల్ జట్టు ఉండాలని మీకు అనిపించడం లేదా? బిహార్ గడ్డ ఎంతో మంది నాణ్యమైన ఆటగాళ్లను దేశానికి అందించింది. పట్నాలో జన్మించిన ఇషాన్ కిషన్ అంతర్జాతీయ వన్డేల్లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ సాధించాడు. సమస్తిపుర్ నుంచి వచ్చిన వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ అరంగేట్రంలోనే రికార్డులు సాధించాడు. గోపాల్‌గంజ్‌లోని ఓ సాధారణ కుటుంబం నుంచి వచ్చిన సాకిబ్ హుస్సేన్ సన్‌రైజర్స్ తరఫున సత్తా చాటుతున్నాడు. ఇంత ప్రతిభ కలిగిన ఆటగాళ్లు ఉన్నా బిహార్ క్రికెట్‌కు ఎందుకు అంతగా గుర్తింపు రావడం లేదు? బిహార్ యువత ప్రతి రంగంలో రాణించేలా అవకాశాలు కల్పించడం. మన కీడ్రాకారులకు వరల్డ్ క్లాస్ సౌకర్యాలు అందించడం నా చిరకాల స్వప్నం. బిహార్ నుంచి వచ్చే జట్టు ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా నిలుస్తుందన్న పూర్తి విశ్వాసం నాకుంది.'అని అగర్వాల్ పోస్ట్ చేశారు. ఈ పోస్ట్‌పై బీహార్ రాష్ట్ర ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి స్పందించారు. 'బిహార్‌కు ఐపీఎల్ టీమ్ ఉండేలా తమ ప్రభుత్వం కృషి చేస్తుంది. మీ సహకారంతో ఓ పాజిటివ్ నిర్ణయం తీసుకుంటాం' అని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. దాంతో ఐపీఎల్‌లో కొత్త టీమ్ రాబోతుందా అనే చర్చ ఊపందుకుంది.



## ఐపీఎల్‌కు విజయ్ శంకర్ గుడ్‌బై

భారత ఆల్‌రౌండర్, తమిళనాడు క్రికెటర్ విజయ్ శంకర్.. ఐపీఎల్‌తో పాటు దేశవాళీ క్రికెటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ విషయాన్ని శుక్రవారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. విదేశీ ఫ్రాంచైజీ లీగ్స్ ఆడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన సుదీర్ఘ పోస్టులో పేర్కొన్నాడు. 'క్రికెట్ నా జీవితం. నేను 10 ఏళ్ల వయసులో ఆడటం ప్రారంభించాను. 25 ఏళ్ల వయసులో దేశానికి ప్రాతినిథ్యం వహించే అవకాశం దక్కింది. ఇది నా జీవితంలోనే అత్యంత గర్వించదగిన, సంతోషకరమైన విషయంగా నిలిచిపోతుంది. కొత్త అవకాశాలను వెతుక్కునేందుకు, మరింత ఎక్కువ కాలం క్రికెట్ ఆడేందుకే నేను భారత దేశవాళీ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌కు వీడ్కోలు పలుకుతున్నాను. నాకు నచ్చిన ఆటను ఆడేందుకు అవకాశం కల్పించిన వారికి కేవలం ధన్యవాదాలు చెబితే సరిపోదు. వారికి నేను జీవితాంతం రుణపడి ఉంటాను. నాగ్‌పూర్ వేదికగా భారత్ 500వ వన్డే మ్యాచ్‌లో ఆఖరి ఓవర్ వేసి జట్టును గెలిపించడం ఎప్పటికీ మరిచిపోను. 2019 వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై నేను వేసిన తొలి బంతికే వికెట్ దక్కిన క్షణం నా మదిలో ఎప్పటికీ పదిలంగా ఉంటుంది. ఎన్నో పాఠాలు, లెక్కలేనన్ని జ్ఞాపకాలు ఇచ్చిన బీసీసీఐకి ప్రత్యేక ధన్యవాదాలు. ఐపీఎల్‌లో నాకు అవకాశం కల్పించిన గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ జట్లతో నా ప్రయాణం నన్ను ఒక పరిపూర్ణ ఆటగాడిగా మార్చింది. నా ఎదుగుదలకు కారణమైన కోచ్‌లు, సపోర్ట్ స్టాఫ్, ఫిజియోలు, మెంటార్స్, గ్రౌండ్స్‌మెన్, మీడియా మిత్రులు, డాక్టర్లతో పాటు కష్టసుఖాల్లో అండగా నిలిచిన కుటుంబ సభ్యులు, స్నేహితులకు ధన్యవాదాలు' అని పేర్కొన్నాడు. భారత్ తరఫున 12 వన్డేల్లో 223 పరుగులు చేసిన విజయ్ శంకర్.. 4 వికెట్లు పడగొట్టాడు. 9 టీ20ల్లో 101 పరుగులు చేసి 5 వికెట్లు పడగొట్టాడు. 2019 వన్డే ప్రపంచకప్ సమయంలో అంబటి రాయుడిని కాదని విజయ్ శంకర్‌ను ఎంపిక చేయడం తీవ్ర వివాదాస్పదమైంది. విజయ్ శంకర్ త్రీడీ ప్లేయర్ అంటూ అప్పటి చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ చేసి వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి.

## ధోనీ పేరుతో సీఎస్కే స్కాం: క్రిష్ణమాచారి

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ఎంఎస్ ధోనీ ఆటకోసం నిరీక్షించిన అభిమానులకు నిరాశే మిగిలింది. చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడంతో ధోనీ ఆడుతాడనే ఆశ కూడా ఆవిరైంది. అయితే.. సీజన్ ఆసాంతం మహా భాయ్ ఫిట్‌నెస్‌పై, 'ఇదుగో వస్తుండు.. వచ్చే మ్యాచ్‌లో ఆడే అవకాశముంది' అని అభిమానులను మభ్యపెట్టిన సీఎస్కే యామజమాన్యంపై మాజీ ఆటగాడు క్రిష్ణమాచారి శ్రీకాంత్ మండిపడ్డాడు. పంతొమ్మిదో సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ధోనీ స్కామ్‌కు తెర తీసిందని ఆయన తీవ్రంగా విమర్శించాడు. లెజెండరీ క్రికెటర్ ఎంఎస్ ధోనీ ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ఒక్కటంటే ఒక్క మ్యాచ్ ఆడలేదు. గాయం నుంచి కోలుకుంటున్న ధోనీ త్వరలోనే ఫిట్‌నెస్ సాధిస్తాడని, లీగ్ దశ చివర్లో ఆడుతాడని చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్, కోచ్ చెప్పిన మాటలన్నీ అబద్ధాలని అభిమానులు గ్రహించారు. ఈ విషయంపై మాజీ ఆటగాడు కృష్ణమాచారి శ్రీకాంత్ స్పందిస్తూ 'ధోనీ స్కామ్'కు సీఎస్కే తెర తీసిందని విమర్శించాడు. 'సీజన్ ఆరంభం నుంచి ధోనీ గురించి కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌లు ప్రతిసారి అబద్ధాలు చెబుతూ వచ్చారు. మొదట కాలి గాయంతో ధోనీ బాధ పడుతున్నాడని, అతడు త్వరలోనే జట్టుతో కలవాలని కోరుకుంటున్నామని చెప్పారు. ధోనీ తర్వాతి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని చెపాక్‌లో చివరి మ్యాచ్ టాస్ సందర్భంగా గైక్వాడ్ తెలిపాడు. ఆ మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో ధోనీ ప్రాక్టీస్ చేస్తున్న వీడియోను సీఎస్కే తమ ఎక్స్ ఖాతాలో పెట్టింది. దాంతో, తాలా కచ్చితంగా సన్‌రైజర్స్‌తో ఆడుతాడని అభిమానులు గంపెడు ఆశలతో మైదానానికి పోటెత్తారు.



## ఆ నాలుగో జట్టేదో..!

ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్‌లో నాలుగో బెర్తు కోసం రాజస్థాన్ రాయల్స్ (14), పంజాబ్ కింగ్స్ (13), కేకేఆర్ (13), దిల్లీ క్యాపిటల్స్ (12) రేసులో నిలిచాయి. శనివారం, ఆదివారం జరగనున్న మూడు మ్యాచులతో ఆ జట్ల భవితవ్యం తేలనుంది. ఇప్పటికే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ నాకౌట్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. శనివారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో పంజాబ్ కింగ్స్ తలపడనుంది. ఏకనా స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుంది. ఇందులో పంజాబ్ కింగ్స్ గెలిస్తే 15 పాయింట్లతో అప్పటికి నాలుగో స్థానానికి చేరుకుంటుంది. ఒకవేళ ఓడితే ఇంటికే వెళ్తుంది. ఆదివారం రెండు మ్యాచ్‌లూ కీలకం కానున్నాయి. తొలుత ముంబయి ఇండియన్స్‌తో రాజస్థాన్ రాయల్స్ మధ్యాహ్నం 3.30 గంటలకు తలపడనుంది. ఇందులో ఆర్ఆర్ గెలిస్తే.. 16 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు చేరుకుంటుంది. ఇక పంజాబ్, కేకేఆర్, దిల్లీ ఇంటిముఖం పడతాయి. అలాకాకుండా రాజస్థాన్ ఓడిందనుకోండి.. శనివారం పంజాబ్ గెలిచిఉంటే.. ఆ టీమే ముందడుగు వేసే అవకాశం ఉంటుంది. లీగ్ స్టేజ్‌లో ఆఖరి మ్యాచ్ ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్ – దిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగనుంది. పైన పేర్కొన్నట్లుగా రాజస్థాన్ తమ చివరి మ్యాచుల్లో ఓడితేనే.. ఈ పోరుకు కాస్త విలువ. అలాకాకుండా ఆర్ఆర్ గెలిస్తే మాత్రం కేకేఆర్ మ్యాచ్ నామమాత్రమే అవుతుంది. పంజాబ్, రాజస్థాన్ ఓడిపోయి.. కేకేఆర్ విజయం సాధిస్తే నాకౌట్‌కు చేరుకుంటుంది. దిల్లీ గెలిస్తే మాత్రం మళ్లీ నెట్ రన్‌రేట్ కీలకమవుతుంది. రాజస్థాన్, పంజాబ్ ఓడిపోయి.. దిల్లీతో పోరు వర్షం కారణంగా రద్దైనా సరే కోల్‌కతాకు నాకౌట్ బెర్తు ఛాన్స్ ఉంటుంది. అప్పుడూ ఏ జట్టు నెట్ రన్‌రేట్ ఎక్కువ ఉంటే వారే నాలుగో ప్లేస్ కైవసం చేసుకోనున్నారు.



నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# ఆర్థిక సవాళ్లు.. ఆర్బీఐ ఆసరా

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం భయాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మరియు ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నడుమ దేశ ఆర్థిక వ్యవస్థకు పెను సవాళ్లు ఎదురవుతున్న సమయమిది. ఒకపక్క ఆర్థిక సంక్షోభ ముప్పు పొంచి ఉందన్న ఆందోళనల మధ్య, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తీసుకునే నిర్ణయాలు దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకం. తాజాగా ఆర్బీఐ కేంద్ర ప్రభుత్వానికి భారీ స్థాయిలో డివిడెండ్ (మిగులు నిధులు) ప్రకటించడం ద్వారా, సవాళ్లతో సతమతమవుతున్న ప్రభుత్వానికి ఒక పెద్ద ఊరటనిచ్చింది. ప్రభుత్వ ఆదాయ, వ్యయాలకు మధ్య వ్యత్యాసం పెరుగుతున్న తరుణంలో, ఆర్బీఐ బదిలీ చేసిన ఈ నిధులు కేంద్రానికి ఆర్థికంగా ఊపిరి పోశాయి అనడంలో సందేహం లేదు. బడ్జెట్ అంచనాలకు మించి నిధులు సమకూరడం వల్ల, ద్రవ్యలోటు లక్ష్యాలను చేరుకోవడం ప్రభుత్వానికి సులువవుతుంది. మూలధన వ్యయాన్ని తగ్గించకుండా, రోడ్లు, రైల్వేలు, ఇతర మౌలిక వసతుల ప్రాజెక్టులను నిరాటంకంగా కొనసాగించే వెసులుబాటు దొరుకుతుంది. ఎన్నికల హామీలు లేదా సామాజిక భద్రతా పథకాలకు నిధుల కొరత లేకుండా చూసుకోవచ్చు. ఆర్థిక సంక్షోభం ముంచుకొస్తున్నప్పుడు సెంట్రల్ బ్యాంక్ పాత్ర కేవలం ప్రభుత్వానికి నిధులు ఇవ్వడానికే పరిమితం కాదు. ఆర్బీఐ ప్రస్తుతం రెండు పడవల ప్రయాణం చేస్తోంది. ఒకవైపు ఆర్థిక వృద్ధికి ఊతమివ్వాలి, మరోవైపు ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయాలి. వస్తువుల ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండేలా వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచడం, మార్కెట్లో నగదు ప్రవాహాన్ని తగినంతగా ఉంచి, పారిశ్రామిక, బ్యాంకింగ్ రంగానికి అండగా నిలవడం, అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ పడిపోకుండా విదేశీ మారక నిల్వలను సమర్థవంతంగా వినియోగించడం వల్ల ఉపశమనం కలుగుతుంది. ఆర్బీఐ ఇచ్చిన డివిడెండ్ ప్రభుత్వానికి ఒక తాత్కాలిక ఉపశమనం మాత్రమే. దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం కోసం ప్రభుత్వం కేవలం ఆర్బీఐ నిధులపైనే ఆధారపడకూడదు. ఆర్బీఐ తన కంటిజెన్సీ రిస్క్ బఫర్‌ను (ఆపద నిధి) పటిష్టంగా ఉంచుకోవడం దేశ ఆర్థిక భద్రతకు ఎంతో అవసరం. రేపటి రోజున అనూహ్య సంక్షోభం వస్తే ఎదుర్కొనేందుకు ఆర్బీఐ వద్ద తగినన్ని నిల్వలు ఉండాలి. ప్రభుత్వం పన్నుల వసూళ్లను క్రమబద్ధీకరించడం, ఎగుమతులను ప్రోత్సహించడం, మరియు విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా స్వంత ఆదాయ మార్గాలను పటిష్టం చేసుకోవాలి. అనవసర వ్యయాలకు కళ్లెం వేసి, ఆర్థిక క్రమశిక్షణను పాటించాలి. ఆర్థిక వృద్ధికి విఘాతం కలగకుండా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే కత్తిమీద సాము లాంటి బాధ్యతను ఆర్బీఐ సమర్థవంతంగా మోస్తోంది. కేంద్ర ప్రభుత్వం, ఆర్బీఐ సమన్వయంతో అడుగులు వేస్తేనే రాబోయే ఆర్థిక సుడిగుండాల నుంచి దేశాన్ని సురక్షితంగా బయటకు తీసుకురాగలం. ప్రభుత్వానికి ఆర్బీఐ ఇచ్చిన ఈ అద్భుతమైన అవకాశాన్ని, దీర్ఘకాలిక ఆర్థిక పటిష్టతకు పునాదిగా మలచుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు కేంద్రంపైనే ఉంది.



## చెడును చెడిపేద్దాం!

రండి రండి కలిసిరండి మీరంతా ఊరంతా
లెండి లెండి చెడును చెడుపుదాం మనమంతా
మనమందరం కలిసి చేతనైన దంతా చేద్దాం
ఇల చెడు జరగకుండా ఇకపై అంతా చూద్దాం !

ఇల కామంతో కైపెక్కిన కామాంధులు
ఇంతులపై పూబంతులపై దాడి చేస్తూ
వారి మానప్రాణాలను దోచేస్తున్నారు
మనం కనిపెడదాం ఈ లైంగిక
దొంగల పని పడదాం !

మానవత్వాన్ని మంట కలిపిన
దానవత్వాన్ని ఇంట నిలిపిన
మానాన్ని దోచే మానవ మృగాలు ఉన్న గేహాలను
కూల్చేద్దాం పేల్చేద్దాం రండి రండి త్వర త్వరగా!

చెడు సహవాసాలను చేస్తున్న
పరుల సొమ్మును కాజేస్తున్న
పడుతుల మాన ప్రాణాలను దోచేస్తున్న
పడకటింటి  దొంగల కనిపెట్టి పని పడదాం!

అతివలు అబలలు కాదన్న సంగతి
ఈ జగతి ప్రగతికి వారేగా గతి అన్న
ఇంగిత జ్ఞానాన్ని కలిగిద్దాం అందరికీ
ప్రగతి పథంలో పయనిద్దాం ముందరికి!



గుర్రాల లక్ష్మారెడ్డి
9491387977
కవి-రచయిత
కల్వకుర్తి, నాగర్ కర్నూల్ జిల్లా




# తెగనమ్మి విలపించె!

"నమ్ముకున్న నేలతల్లి ఎన్నడూ మోసం చేయలేదు.. కానీ నమ్ముకున్న ప్రభుత్వ వ్యవస్థలు, పాలసీలు మాత్రం నిలువునా ముంచుతున్నాయి" - ఇది నేడు దేశానికి అన్నం పెట్టే రైతన్న గుండె కోత. ఎండనక, వాననక, రేయింబవళ్లు ఆరుగాలం శ్రమించి పంటలను పండించిన అన్నదాత.. తీరా పంట చేతికొచ్చాక దాన్ని అమ్ముకోవడానికి పడుతున్న అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు మార్కెట్ మాయాజాలం, వీటన్నింటికీ తోడు ప్రభుత్వాల ఉదాసీనత వెరసి.. అన్నదాత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు.

దేశంలోని ఏ రాష్ట్రంలో చూసినా పంట కాలం ముగియగానే కొనుగోలు కేంద్రాల వద్ద మైళ్ల పొడవునా ట్రాక్టర్లు, లారీలు నిలిచిపోవడం సర్వసాధారణంగా మారింది. సరైన శాస్త్రీయ నిల్వ వసతులు లేకపోవడం వల్ల వారాల తరబడి ఓపెన్ మార్కెట్లలో రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఆకాశం మేఘావృతమైతే రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అకాల వర్షాలకు లేదా వడగండ్ల వానలకు తడిసిన ధాన్యాన్ని కొనేందుకు ప్రభుత్వాలు నిరాకరిస్తుండటంతో, అప్పుల భారం తట్టుకోలేక రైతులు తమ పంటను మద్దతు ధర కంటే సగానికి పైగా తక్కువ ధరకే దళారులకు తెగనమ్ముకుంటున్నారు. పంటల కొనుగోలు ప్రక్రియలో కనీస అవసరాలైన గన్ని సంచుల కొరత ప్రతి ఏటా జాతీయ స్థాయిలో చర్చనీయాంశమవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపం, రవాణా వ్యవస్థల వైఫల్యం వల్ల తూకం వేసిన పంటను మిల్లులకు లేదా ఎఫ్‌సీఐ గోదాములకు తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొనుగోలు కేంద్రాల వద్దే రోజు తరబడి ధాన్యం ఎండకు ఎండిపోవడం వల్ల బరువు తగ్గుతోంది. దీంతో ఆ నష్టాన్ని కూడా అన్నదాత ఖాతాలోనే వేస్తున్నారు. రైతు ఎన్నో ఇబ్బందులు పడి తూకం వేయించుకుని రైస్ మిల్లర్లు లేదా పెద్ద వ్యాపారుల వద్దకు వెళ్లాక అసలు కథ మొదలవుతోంది. అక్కడ తేమ శాతం, తరుగు పేరుతో క్వింటాలుకు 3 నుండి 10 కిలోల వరకు చట్టవిరుద్ధంగా కటింగ్ విధిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా కనీస మద్దతు ధర ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఈ తరుగు కటింగ్‌లు, కమీషన్ ఏజెంట్ల  ఒత్తిడి వల్ల రైతుకు ప్రభుత్వం నిర్ణయించిన అసలు ధర దక్కడం లేదు. మధ్యలో ఉన్న దళారీ వ్యవస్థే దేశవ్యాప్తంగా వ్యవసాయ లాభాలను కొల్లగొడుతోంది.

దేశంలో ఏటా ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగవుతుందో శాటిలైట్ డాటా, సాంకేతికత ద్వారా అంచనా వేసే సదుపాయం ఉన్నప్పటికీ, కొనుగోళ్ల విషయంలో ముందస్తు వ్యూహం రచించడంలో పాలకులు పూర్తిగా విఫలమవుతున్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద కనీస వసతులైన టార్పాలిన్లు, తాగునీరు, ఎండ తీవ్రత నుంచి రక్షణ కల్పించే షెడ్లు కరువయ్యాయి. రక్షణ చర్యలు లేకపోవడం వల్ల కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు మరణించిన ఘటనలను కూడా మనం చూస్తునే ఉన్నాం. పంటను కష్టపడి అమ్ముకున్నాక కూడా రైతు ఖాతాల్లో డబ్బులు జమ కావడానికి నెలల సమయం పడుతోంది. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానం కొన్ని చోట్ల సత్ఫలితాలు ఇస్తున్నా, దేశవ్యాప్తంగా నిధుల విడుదల ఆలస్యం కావడం వల్ల కర్షకులు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. తదుపరి పంట పెట్టుబడి కోసం సమయానికి చేతిలో డబ్బులు లేకపోవడంతో, అన్నదాతలు మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు అప్పులు చేస్తూ చివరకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎన్నికల ప్రణాళికల్లో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున హామీలు గుప్పిస్తాయి. కానీ అధికారంలోకి వచ్చాక క్షేత్రస్థాయిలో రైతును కేవలం ఒక ఓటు బ్యాంకులాగే చూస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. దేశానికి వెన్నెముక అని చెప్పే రైతన్న, తాను పండించిన పంటను గౌరవప్రదంగా అమ్ముకోవడం కోసం రోడ్డెక్కి పోరాడాల్సి రావడం ముమ్మాటికీ వ్యవసాయ పాలసీల వైఫల్యమే. ఇప్పటికైనా పాలకులు తాత్కాలిక రాయితీలు పక్కనబెట్టి, అన్నదాతకు భరోసా ఇచ్చేలా దేశవ్యాప్తంగా శాశ్వత, పారదర్శక కొనుగోలు విధానాన్ని అమలు చేయాలి.

-ముత్యాల సురేశ్, 9912715325
సీనియర్ జర్నలిస్ట్

## నీ ప్రతిభే నీ గుర్తింపు

ఇప్పుడు మనుషుల్లో
స్వార్థచింతన తప్పా
సమతమమతలు మృగ్యమయ్యాయి

వ్యక్తిత్వవికాసంలేదు
ఉమ్మడి కుటుంబ భావన అసలే లేదు
తాము ఎదగడం కోసం ఎవరినైనా తొక్కేసే
అడ్డదారి గుంపులే అడుగడుగునా
కన్పిస్తున్నాయి

అహోరాత్రులు చదివి
సంపాదించుకోవలసిన
యోగ్యతా పత్రాలు
అడ్డదారుల్లో పైసలిచ్చికొంటున్నారు
పేరుకు ముందు ఘనమైన బిరుదులతో
ఊరేగుతున్నారు

లోగుట్టు పెరుమాండ్లకెరుక!
బయట గుసగుసలు ఈ చెవి నుండి ఆ
చెవికి దాపరికం లేకుండా
భూమండలమంతా చుట్టేస్తున్నాయి
ఇప్పుడు ఏది దాపరికం కాదు
తిమ్మిని బమ్మి చేసే
బమ్మిని తిమ్మి చేసే రోజులు ఎప్పుడో
వెళ్లిపోయాయి

ఆ మిషలో బ్రతకడం అవివేకం
నీ స్వీయ ప్రతిభే నీ వ్యక్తిగత గుర్తింపు
అరువు తెచ్చుకొని బ్రతకడం అంటే
పరాన్నజీవమేకదా!

అంకాల సోమయ్య
దేవరుప్పుల జనగామ
9640748497

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.